Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 27.10.2017, శుక్రవారం సంపుటి : 37 సంచిక : 21 పేజీలు : 12, వెల : ₹ 5




# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com

• తిరగబడ్డ...

# తెలంగాణ తెలుగుబిడ్డ



- రేవంత్ తిరుగుబాటుతో 'దేశం' నేతల్లో గుబులు
- ఓటు - నోటు కేసులో ఆయనే కీలకం
- కేసీఆర్ - ఏపి టీడీపీ నేతల కుమ్మక్కు బట్టబయలు

కొన్ని నెలల క్రితం తెలంగాణ సీఎం కేసీఆర్‌తో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన తెలుగుదేశం నేతలు భేటీ అయ్యారు. ఈ సమావేశాన్ని పెట్టించింది ఒక మీడియాధిపతే! ఈ భేటీ సారాంశం ఏంటంటే... రెండు రాష్ట్రాల రాజకీయాలలోనూ 'రెడ్ల'ను తొక్కడం. తెలంగాణలో మీకు ప్రధాన ప్రత్యర్థులు రెడ్లే! అంటే అక్కడ కాంగ్రెస్‌పార్టీలో రెడ్ల ఆధిపత్యం వుంది. ఆంధ్రప్రదేశ్‌లో మాకు ప్రధాన అడ్డం రెడ్లే... అంటే వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ అన్నమాట. తెలంగాణలో మీ అధికారానికి మేం అడ్డురాం... ఏపిలో ఎలాగూ మాకు మీతో వచ్చే ఇబ్బందేమీ లేదు. ఇరు రాష్ట్రాలలోనూ పరస్పరం సహకరించుకుందాం, మనలో మనం తన్నుకోవడం చాలిద్దాం... మన ఉమ్మడి టార్గెట్ అయిన 'రెడ్ల'ను రాజకీయంగా దెబ్బకొడదాం... ఈ సారాంశం కేసీఆర్‌కు కూడా నచ్చింది. ఆయనకు కావాల్సింది అధికారాన్ని నిలబెట్టుకోవడం. ప్రత్యర్థిగా వున్న తెలుగుదేశమోళ్ళు టీఆర్ఎస్‌కు మద్దతు పలుకుతామంటే ఆయనకు అంతకంటే కావాల్సిందేముంది. ఈ కుల సమీకరణల ఒప్పందాలు కుదిరాకే ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల మాటలు, వ్యవహారశైలి మారిపోయింది.

ఓటు-నోటు కేసప్పుడు చంద్రబాబుపై ఒంటి కాలిమీద లేచిన కేసీఆర్ ఆ తర్వాత సైలెంటయ్యాడు. (మిగతా 11వ పేజీలో)

• జగన్ పాదయాత్ర...


## టీడీపీకి చేదు మాత్ర?

3లో

• కాకాణికి...

## నకిలీ మకిలి

3లో



# పేదల కష్టాలు తెలిసిన ప్రధాని మోడీ - సురేష్‌రెడ్డి



ప్రధాని నరేంద్రమోడీ సామాన్య కుటుంబంలో జన్మించి, అంచలంచలుగా ఎదిగి నేడు ప్రధానిగా ఉన్నారని, పేదల కష్టాలు బాగా తెలుసునని, అందుకే దేశ వ్యాప్తంగా పేద, బడుగు వర్గాల ప్రజల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని, ఆ పథకాలకు మరింత ప్రచారం కల్పించి ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయాలని బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌రెడ్డి ఇటీవల జిల్లా కలెక్టర్‌కు అందజేసిన ఒక విజ్ఞాపనలో పేర్కొన్నారు.

అదేవిధంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధాని నరేంద్రమోడీ చిత్రపటాలను ఉంచాలని కోరారు. మహిళల ఆత్మగౌరవం కోసం, వారి సంక్షేమం కోసం ప్రధాని అనేక పథకాలను అమలు చేస్తున్నారని, స్వచ్ఛభారత్ పథకానికి, కిలో రూపాయి బియ్యం పథకానికి, వృద్ధులు వికలాంగుల పింఛన్లకు, పట్టణప్రాంతాల్లో పేదలకు ఇళ్ల నిర్మాణాలకు, గ్రామీణ ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణానికి, చెరువులు, కాలువల పథకానికి, నీరు-చెట్టు పథకానికి, రైతన్నల కష్టాలు తీర్చేందుకు పంటల బీమా, రైతులకు తక్కువ వడ్డీకే రుణాలు..ఇలా అనేక పథకాలకు కేంద్రం తనవంతు సాయం అందిస్తోందని, అయితే ప్రజలకు ఈ విషయాలపై అవ గాహన ఉండడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా అధికార యంత్రాంగం స్పందించి ప్రధాని మోడీ అమలు చేస్తున్న పథకాలను ప్రజలకు వివరంగా తెలియజేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

### 18ఏళ్లు నిండిన వారందరికి

# ఓటు హక్కు కల్పించాలి



నెల్లూరుజిల్లాలో 18ఏళ్ళు నిండిన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ సూచించారు. 24వ తేదీ నెల్లూరు పినాకిని గెస్ట్‌హౌస్‌లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2019లో సాధారణ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాలను సిద్ధం చేయాలన్నారు. మరణించినవారు, శాశ్వతంగా గ్రామాలను వదలివెళ్ళిన వారి ఓట్లను తొలగించాలని, తాత్కాలిక వలస దారుల ఓట్లను తొలగించవద్దని తెలిపారు. నవంబర్ 1 నుంచి 20రోజుల పాటు ఇంటింటి సర్వేను ట్యాబ్‌లతో నిర్వహించాలన్నారు. డీలిమిటేషన్ ఉత్తర్వుల ప్రకారం కార్పొరేషన్ పరిధిలో వార్డుల బౌండరీలను ఖచ్చితంగా ఏర్పాటు చేయాలన్నారు. ఓటర్ల జాబితాలో అదృశ్యమైన అర్హుల ఓట్లను చేర్చాలన్నారు. మ్యాపింగ్ విషయంలో శ్రీహరికోట అంతరిక్ష కేంద్ర సహాయసహకారాలను తీసుకోవాలన్నారు. జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు, డిఆర్‌ఓ వెంకటసుబ్బయ్య, నగర కమిషనర్ ఢిల్లీ రావు, ఆర్డీఓలు భక్తవత్సలరెడ్డి, బాపిరెడ్డి, అరుణ్‌బాబు, శీనానాయక్ పాల్గొన్నారు.

సింహపురి సమాచారం

### హాస్టళ్ళలో

# వైద్యశిబిరాలు నిర్వహించాలి




జిల్లాలోని ఎస్సీఎస్టీ బిసి సంక్షేమ హాస్టళ్ళలో విద్యార్థులకు విషజ్వరాలు రాకుండా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ దళిత ప్రజా సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు అరవ పూర్ణప్రకాష్ ఒక ప్రకటనలో జేసీ ఇంతియాజ్‌ను కోరారు. ఈ హాస్టళ్ళలో మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేవిధంగా, మురుగునీటి పారుదల సక్రమంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

### ల్యాబ్ టెక్నీషియన్ పోస్ట్

# ధరఖాస్తులకు ఆహ్వానం

జిల్లాలోని ప్రభుత్వ రక్తనిధి కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ల్యాబ్ టెక్నీషియన్ పోస్ట్‌లను తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేస్తున్నామని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖ అధికారి రమాదేవి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నెల్లూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రక్తనిధిలో ల్యాబ్ టెక్నీషియన్-1, కంపొనెంట్ ల్యాబ్ టెక్నీషియన్-1, కావలి ఏరియా ఆసుపత్రిలోని రక్తనిధిలో సాధారణ ల్యాబ్ టెక్నీషియన్-1 ఖాళీలకు ధరఖాస్తులను ఆహ్వానిస్తున్నామన్నారు. బిఎస్సీ(ఎంఎల్‌టి) ఉత్తీర్ణులై, రెండేళ్ళ అనుభవం ఉన్నవారు అర్హులని, అభ్యర్థులు తమ ధరఖాస్తులను అక్టోబర్ 30వ తేదిలోగా సంతపేటలోని జిల్లా అదనపు వైద్యఆరోగ్యశాఖ అధికారి కార్యాలయానికి చేరేలా పంపాలన్నారు.



## జగన్ పాదయాత్ర...
# టీడీపీకి చేదుమాత్ర?

**ప్రజలతో కలవడం, ప్రజలతో కలిసి నడవడం, ప్రజలతో మాట్లాడడం, ప్రజలు చెప్పింది వినడం, ఆ ప్రజల కష్టాలను తీర్చడానికి పని చేయడం... ఉత్తమ ప్రజానాయకులకు ఉండాల్సిన లక్షణాలు. పుట్టగానే లేదా ఒంటిమీద ఖద్దరు చొక్కా పడగానే ఎవరూ ప్రజానాయకులైపోరు. ప్రజల మనసులు గెలిచినవాళ్లే ప్రజా నాయకులవుతారు. తాతలు, తండ్రుల రాజకీయ వారసత్వం తాత్కాలికమే. కానీ, వ్యక్తిగతంగా ప్రజలలో తెచ్చుకున్న పరపతే శాశ్వతం.**

ఆంధ్రప్రదేశ్ ప్రజలు వై.యస్.జగన్మోహన్‌రెడ్డికి 2014 ఎన్నికల్లో ఓ మంచి అవకాశమిచ్చారు. అదే ప్రతిపక్షనేత బాధ్యత. సాధారణంగా ఇతర నాయకులకైతే రాజకీయ ఆరంగేట్రం చేసాక ఏ పాతికేళ్లకోగాని ఇలాంటి అవకాశం రాదు. జగన్‌కు రాజకీయాల్లోకి వచ్చిన ఐదేళ్ళకే ప్రధాన బాధ్యత వచ్చింది.

2014 ఎన్నికల్లో వైకాపా అధికారంలోకి వచ్చుంటే అది వై.యస్.రాజశేఖరరెడ్డి సానుభూతి ప్రభావమే అయ్యుండేది. కాని, ప్రతిపక్షంలో ఉండడం వల్ల ఈ మూడున్నరేళ్ల కాలంలో జగన్ బాగా రాటుదేలాడు. రాష్ట్రంలో ప్రజల సమస్యలపై పూర్తిస్థాయిలో అవగాహన తెచ్చుకోగలిగాడు. అసెంబ్లీ చర్చల్లో సైతం పూర్తిస్థాయి సమాచారంతో ప్రశ్నలు సంధించి అధికారపక్షాన్ని ఇరుకున పెట్టిన సందర్భాలెన్నో. వై.యస్.రాజశేఖరరెడ్డి రాజకీయ ప్రయాణం మొదలుపెట్టిన పాతికేళ్ళ తర్వాతగాని ముఖ్యమంత్రి కాలేదు. సీఎం కావడానికి ముందే రాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత పాత్రను సమర్ధవంతంగా నిర్వహించాడు. 2002 సంవత్సరంలో చేవెళ్ల నుండి ఇచ్ఛాపురం వరకు 1470 కిలోమీటర్ల దూరం ఆయన చేసిన పాదయాత్ర చరిత్రలో నిలిచిపోయింది. 2004లో ఆయన సీఎం అయ్యాక పాదయాత్రలో చూసిన సమస్యలు, ప్రజల కష్టాలు గ్రహించబట్టే ఎన్నో ప్రజాసంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టగలిగాడు.

తండ్రి వై.యస్.రాజశేఖరరెడ్డి వారసునిగా రాజకీయాలలోకి అడుగుపెట్టిన వై.యస్.జగన్ కూడా ఆయన బాటలోనే నడుస్తూ ఇడుపులపాయ నుండి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర చేయాలని నిర్ణయించుకోవడం తెలిసిందే! తొలుత ఈ నెల 27వ తేదీన పాదయాత్రను మొదలుపెట్టాలనుకున్నప్పటికి ఆరోజు మంచిరోజు కాదని పెద్దలు సలహా ఇవ్వడంతో తేదీని మార్చుకున్నారు. ఈలోపు జగన్ ప్రతి శుక్రవారం కోర్టుకు హాజరు కావాల్సి వుండడంతో ఆరు నెలల పాటు దాని నుండి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ వేశారు. అయితే కోర్టు అందుకు అంగీకరించలేదు. దీంతో నవంబర్ 6వ తేదీ నుండి పాదయాత్ర మొదలుపెట్టాలని నిర్ణయించారు. 4వ తేదీ తిరుమలకు అలిపిరి నుండి కాలినడకన వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటారు. పక్కరోజు కడప పెద్దదర్గానూ, చర్చిలో ప్రార్ధనలు నిర్వహించి 6వ తేదీన పాదయాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. ప్రతి శుక్రవారం కోర్టుకు హాజరు కావాల్సి వుండడంతో వారానికి నాలుగు లేదా ఐదు రోజులు మాత్రమే జగన్ పాదయాత్ర నిర్వహించే అవకాశముంది.

2002లో వై.యస్.రాజశేఖరరెడ్డి నిర్వహించిన పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రతి పల్లె, ప్రతి పట్టణ ప్రజలు ఆయనకు తమ సమస్యలు చెప్పుకున్నారు. వై.యస్. పాదయాత్ర తర్వాత జరిగిన 2004 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మట్టికరిచింది. ఇప్పుడు జగన్ పాదయాత్ర... పైకి ఎంత గంభీరంగా ప్రకటనలు చేస్తున్నా తెలుగుదేశం నేతల్లో భయం వుంది. ప్రభుత్వం పట్ల ప్రజల్లో ఇంకా వ్యతిరేకత పెరుగుతుందేమోనని ఆందోళన వుంది. హిస్టరీ రిపీట్ అవుతుందేమోనన్న అనుమానమూ వుంది.

# వీర జవానులతో "వెంకయ్య దీపావళి"



**అక్టోబర్ 19వ తేదీ దీపావళి పండుగను దేశ సరిహద్దుల్లో దేశం కోసం ప్రాణాలొడ్డి పోరాడే వీరజవానులతో జరుపుకుని తన ప్రత్యేకతను, దేశభక్తిని చాటారు మన భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. తన శ్రీమతి ఉషమ్మతో కలసి ఇండోటిబెటన్ సరిహద్దు సైనికులకు మిఠాయిలు పంచిపెట్టారు. వారందరినీ పేరుపేరునా పలుకరించి పులకరింపజేశారు.**



## విపిఆర్ ఆధ్వర్యంలో...
# కార్తీక మాస లక్షదీపోత్సవం



కార్తీక మాసం హిందువులకు ఎంతో పవిత్రమైనది. నెలంతా కూడా భక్తులు ఎంతో నిష్టగా వుంటూ పూజల్లో పాల్గొంటుంటారు. ఈ మాసంలో కార్తీక దీపారాధనకు ఎంతో విశిష్టత వుంది. కార్తీకమాసంలో కార్తీక దీపారాధనకు వున్న ప్రాధాన్యత దృష్ట్యా నెల్లూరు జిల్లాలో ఎన్నో సామాజిక, ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో తరిస్తున్న విపిఆర్ ఫౌండేషన్ అధినేత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కార్తీక మాసం లక్ష దీపోత్సవం ఏర్పాటు చేశారు. ఈ నెల 27, 28, 29 తేదీలలో నెల్లూరులోని విఆర్ హైస్కూల్ మైదానంలో లక్ష దీపోత్సవానికి భారీగా ఏర్పాట్లు చేసారు. దీపారాధన అనంతరం స్వామివారి దర్శనం ఏర్పాటు కూడా చేసారు. భక్తులు వేలసంఖ్యలో తరలివచ్చి ఈ ఆధ్యాత్మిక సంబరంలో పాలుపంచుకోవాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# కాకాణికి నకిలీ మకిలి



రాజకీయ నాయకులకు సొంత ఆలోచన, సమస్యలపై సొంతంగా అవగాహన ఉండాలి. రాజకీయాలలో వున్నపుడు ఇతరులు సలహాలు, సూచనలు ఇస్తుంటారు. అవెంతవరకు సాధ్యమో ఆలోచించుకోవాలి. రాజకీయాలలో వున్నప్పుడు ఎదుటివారు చెప్పేది వినాలి. వారు చెప్పిన విషయాలపై మనం సొంతంగా పరిశీలన చేసుకుని అడుగేయాలి. అంతేగాని ఎవరెవరో చెప్పింది విని అడుగులు వేస్తే అవి తప్పటడుగులే అవుతాయి. అలా తప్పటడుగులు వేసే సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఇప్పుడు చిక్కుల్లో పడ్డాడు. అసలే ఎన్నికల నాటి నకిలీ మద్యం కేసుతో సతమతమవుతున్న ఆయన మెడకు తాజాగా నకిలీ డాక్యుమెంట్ల కేసు తగులుకుంది. గత ఏడాది డిసెంబర్‌లో నకిలీ డాక్యుమెంట్లు చూపించి మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై నిరాధార ఆరోపణలు చేసినందుకుగాను సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఛార్జిషీటు దాఖలైంది. ఈ కేసులో ఆయనను ఏ-1 ముద్దాయిగా, ఏ-2గా పసుపులేటి చిరంజీవి, ఏ-3గా పి.వెంకటకృష్ణ, ఏ-4గా జె.హరిహరన్‌లను చేర్చి నెల్లూరు మొదటి తరగతి నాలుగో అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో ఛార్జీషీట్ దాఖలు చేశారు.

అప్పట్లో సోమిరెడ్డి ఫిర్యాదు ఆధారంగా నెల్లూరురూరల్ పోలీసులు రంగంలోకి దిగి విచారణ మొదలుపెడితే అసలు కథంతా బయటపడింది. అప్పుడే పసుపులేటి చిరంజీవి అనే మోసగాడు సృష్టించిన నకిలీ డాక్యుమెంట్లుగా ఇవి తేలాయి. ఈ ఏడాది జనవరిలోనే పోలీసులు చిరంజీవిని, మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. కాగా, కాకాణి చూపించిన డాక్యుమెంట్లు ఫోర్జరీ అని తాజాగా ఫోరెన్సిక్ లేబొరేటరీ నిర్ధారించింది. అలాగే కాకాణి చెప్పిన తేదీలలో సోమిరెడ్డి మలేషియాకు వెళ్ళలేదని ఇమిగ్రేషన్ అధికారులు నిర్ధారించారు. దీంతో సోమిరెడ్డిపై కాకాణి చేసినవి తప్పుడు ఆరోపణలేనని తెలిపోవడంతో కాకాణికి చిక్కులు ఇంకొంచెం పెరిగినట్లయ్యింది.




## 'ప్రభా'తం

ప్రగతి రథం కదిలింది. ఎప్పుడెప్పుడా అని అందరూ ఎదురుచూస్తున్న ఆర్థిక ప్రగతిరథానికి మరింత ఊపు తెచ్చేవిధంగా ప్రధాని మోడీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం మున్నెన్నడూ లేనివిధంగా 'భారత్‌మాల' వంటి అసాధారణ నిర్ణయాలతో ముందుకు దూసుకువస్తోంది. దేశంలో ఇప్పటికే అధోగతిలో.. అధ్వాన్న స్థితిలో ఉన్న రహదారులకు మోక్షం కల్గించేందుకు, తద్వారా దేశ ప్రగతిరథ చక్రాలకు ఇక ఎలాంటి ఆటంకం లేకుండా ఉండేందుకు కేంద్రం సత్వర చర్యలు తీసుకుంటోంది. ఎంతో ప్రతిష్ఠాత్మకమైన 'భారత్‌మాల' ప్రాజెక్టుకు, తదితర జాతీయ రహదారుల నిర్మాణం కోసం ఏకంగా అక్షరాలా ఏడు లక్షల కోట్ల రూపాయలను విడుదల చేసేందుకు కేంద్రప్రభుత్వం ఆమోదముద్ర వేసి దేశ ఆర్థికవృద్ధికి మార్గం సుగమం చేసింది. ప్రధాని మోడీ అధ్యక్షత్వంలో ఇటీవల జరిగిన సమావేశంలో ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆ మేరకు ఈ భారీ ప్రాజెక్టులకు పచ్చజెండా ఊపడం ఎంతైనా హర్షదాయకం. ఇంతటి 'భారీ' నిర్ణయాలు ఎంతైనా సాహసమే. అయితే, దేశాభ్యున్నతికి ఎంతో అవసరమైన జాతీయ రహదారులను అభివృద్ధి చేయడం ఎంతైనా అవసరమే. దేశంలో 83వేల కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల్ని అయిదు సంవత్సరాల్లో ఏడులక్షల కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి చెందించడానికి రూపొందించిన పథకమే 'భారత్‌మాల'. ఈ ప్రాజెక్టు ద్వారా దేశ సరిహద్దులతో పాటు దేశంలోని అనేక ప్రాంతాలను కలుపుతూ వేలాది కిలోమీటర్ల దాకా జాతీయ రహదారులను నిర్మించడానికి శ్రీకారం చుట్టడం దేశచరిత్రలో ఇదే ప్రథమం. జాతీయ రహదారులు ఎలాంటి అవరోధాలు లేకుండా శుభ్రంగా ఉంటే ప్రయాణం ఎంత వెసులుబాటుగా ఉంటుందో అందరికీ తెలిసిందే. కార్గోలు వేగవంతంగా ప్రయాణించేందుకు వీలుగా ఈ రహదారుల నిర్మాణాలు ఉంటాయని, ఎకనమిక్ కారిడార్ల అభివృద్ధి కూడా దీనిలో జతకలిసి ఉంటుంది కనుక, అనేక ప్రాంతాలకు దారులు తీసే ఈ జాతీయ రహదారులు అనేకప్రాంతాల ప్రజలకు అందుబాటులో ఉంటాయని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది. ముంబై-కొచ్చిన్-కన్యాకుమారి, బెంగుళూరు-మంగుళూరు, హైదరాబాద్- పణజీ, సంబల్‌పూర్-రాంచీ వంటి దాదాపు నలభైదాకా ప్రాజెక్టులు ఈ ఎకనమిక్ కారిడార్లలో ఉండబోతున్నాయి. అదేవిధంగా, భారత్‌మాల ప్రాజెక్టుల్లో తొలిదశలో 20వేల కిలోమీటర్ల దాకా జాతీయ రహదారుల నిర్మాణాలను త్వరలోనే ప్రారంభించనుండడం ఎంతో సంతోషదాయకం. రహదారులు తదితర ప్రాజెక్టుల కోసం సుమారు పదిలక్షల కోట్ల రూపాయల దాకా వ్యయమవుతున్నదంటే ఇవెంత భారీ ప్రాజెక్టులో ఊహించుకోవచ్చు. 'భారత్‌మాల' వంటి ప్రాజెక్టుల ద్వారా సమర్థవంతమైన రవాణా ఏర్పాట్లు జరుగుతాయని, సరుకుల సత్వర రవాణాకు ఇబ్బంది లేకుండా, రోడ్లపై ఉన్న అనేకానేక అవరోధాలను తొలగించి, రోడ్లపై ప్రయాణాన్ని మరింత సులువుగా, సునాయాసంగా, వేగవంతంగా, ప్రమాదరహితంగా తీర్చిదిద్దేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతాయని భావించవచ్చు. దేశంలో ఇది అతిపెద్ద భారీ ప్రాజెక్టుగా అవతరించనుంది కూడా. ఇందులో సుమారు 9వేల కిలోమీటర్ల ఎకనమిక్ కారిడార్లు, 6వేల కిలోమీటర్ల ఇంటర్ కారిడార్‌లే కాక, 5 వేల కిలోమీటర్ల మేరకు జాతీయ కారిడార్‌ల సామర్థ్యాన్ని పెంచడం, మరో 2వేల కిలోమీటర్ల సరిహద్దు అనుసంధానం చేయడం, 8 వందల కిలోమీటర్ల ఎక్స్‌ప్రెస్ మార్గాలు, 10వేల కిలోమీటర్ల మేర జాతీయ రహదారుల అభివృద్ధి..ఇవన్నీ ఈ ప్రాజెక్టులో అంతర్భాగాలే. ఈ బృహత్తర ప్రాజెక్టు అమలుతో ఉపాధి అవకాశాలు కూడా బాగా మెరుగుపడతాయనడంలో సందేహం లేదు. ఈ భారీ ప్రాజెక్టుల నిర్మాణాలకు సగం డబ్బును మార్కెట్‌నుంచి, ప్రైవేట్ పెట్టుబడుల ద్వారా రాబడతారు. మిగిలిన సగం మొత్తాన్ని రహదారి బాండ్లు, సుంకాల ద్వారా సమీకరిస్తారు. హైవేలపై చేసే వ్యయంతో కలిపితే, ఈ మొత్తం వ్యయం సుమారు 14 లక్షల కోట్లకు చేరుకుంటుందని అంచనా. అటు పెద్దనోట్ల రద్దు, ఇటు జిఎస్టీలతో దేశ ఆర్థికపరిస్థితి మసకబారుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్న దశలో, దేశ ఆర్థికవృద్ధిపై ఎలాంటి అనుమానాలకు తావు లేకుండా కేంద్రప్రభుత్వం ఇంతటి బృహత్తర ప్రాజెక్టులను ప్రకటించడం అందరికీ విస్మయం కలిగించేదే అయినప్పటికీ, ఈ భారీ ప్రాజెక్టుల నిర్మాణాల ద్వారా ఉపాధి అవకాశాలు కనీవినీ ఎరుగునంతగా పెరిగి ఆర్థిక రంగానికి ఎలాంటి ఢోకా లేకుండా చేస్తుందని భావించవచ్చు. అంతేకాదు, మొండిబకాయిలతో కుదేలైపోయిన బ్యాంకింగ్ రంగానికి కూడా ఊతమిస్తూ సుమారు రెండులక్షల కోట్లకు పైగా మొత్తాన్ని బ్యాంకులకు మూలధనంగా ఇవ్వడానికి కేంద్రం నిర్ణయించడం కూడా అసాధారణ నిర్ణయమేననక తప్పదు. ఈ నేపథ్యంలో త్వరలో బ్యాంకింగ్ రంగంలో సంస్కరణలు కూడా రానున్నాయి. గత ఏడాది నుంచి ద్రవ్యోల్బణం క్రమేణా తగ్గుతూ వస్తోందని, జీడీపీ వృద్ధి చెందుతోందని, త్వరలోనే భారత్ 8 శాతం వృద్ధి రేటు సాధిస్తుందనే అంతర్జాతీయ ద్రవ్యనిధి అంచనాలు వాస్తవమే అవుతాయని ప్రభుత్వం గట్టిగా విశ్వసిస్తోంది. దేశ ఆర్థికవృద్ధికి, ప్రజల ఉపాధి కల్పనకు కేంద్రం తీసుకుంటున్న ఈ నిర్ణయాలు, భారీ ప్రాజెక్టులు.. దేశ ప్రగతి రథచక్రాలకు ఎలాంటి అవరోధాలు లేకుండా పరుగులెత్తించేవేనని భావించవచ్చు. భారీప్రాజెక్టుల వల్ల సుమారు 14 కోట్ల పనిదినాలు ఉపాధిగా లభ్యమవుతాయని అంచనా. జాతీయ రహదారులు, గృహనిర్మాణాలు, విద్యుత్, మౌలిక సదుపాయాలు, డిజిటల్ రంగాలు.. వంటి ప్రధానమైన రంగాల్లో భారీగా నిధులు వెచ్చించి అభివృద్ధి చేయడం వల్ల ప్రజలకు ఉపాధి అవకాశాలు మెరుగుపడడమే కాక, దేశ ఆర్థికాభివృద్ధి కూడా క్రమంగా పుంజుకుంటుందని భావించవచ్చు. ఏదేమైనా, గతంలో ఎన్నడూ లేనివిధంగా, దేశంలో ఇంతటి భారీ ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టడం వల్ల అటు ప్రజలకు ఉపాధి, ఇటు దేశానికి ఆర్థికవృద్ధి జమిలిగా కలిగి, దేశ ప్రగతికి ఈ నిర్ణయాలు మంచిదారులు వేస్తాయనే ఆశిద్దాం!

### అసాధారణ నిర్ణయాలు

అటు పెద్దనోట్ల రద్దు, ఇటు జిఎస్టీలతో దేశ ఆర్థికపరిస్థితి మసకబారుతోందని విమర్శలు వెల్లువెత్తుతున్న దశలో కేంద్ర ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిలో 'భారత్‌మాల' వంటి బృహత్తరమైన ప్రాజెక్టులను ప్రకటించడం సాహసోపేతమే. ప్రభుత్వం భావిస్తున్నట్లుగా జాతీయ రహదారుల నిర్మాణాల ద్వారా ప్రజలకు ఉపాధి, ఉద్యోగావకాశాలు గణనీయంగా పెరుగుతాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అదే విధంగా దేశఆర్థిక రంగం కూడా క్రమంగా పుంజుకుంటుందని ఆశించవచ్చు.

## యల్లాయపాళెంలో 'లవకుశ'లు



నెల్లూరు జిల్లా కొడవలూరు మండలంలోని యల్లాయపాళెం గ్రామానికి లవకుశులు నాగరాజు, సుబ్రహ్మణ్యంలు ఈ నెల 22వ తేదీన వచ్చారు. 1963వ సంవత్సరంలో కొడవలూరు మండలంలోని నాయుడుపాళెం గ్రామానికి చెందిన అల్లారెడ్డి శంకరరెడ్డి నిర్మించిన లవకుశ సినిమాలో నాగరాజు, సుబ్రహ్మణ్యంలు లవకుశలుగా నటించారు. యల్లాయపాళెం గ్రామంలోని దేవిరెడ్డి సుందరరామిరెడ్డి, బుజ్జమ్మల వర్ధంతి కార్యక్రమానికి వీరు రావడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు లవకుశలను ఆప్యాయంగా పలకరించారు. ఆనాటి సినిమా విశేషాల గురించి లవకుశలతో పలువురు ముచ్చటించారు.

ఈ సందర్భంగా లవకుశలు మాట్లాడుతూ తాము 11ఏళ్ళ వయసులో లవకుశ సినిమాలో నటించామని అప్పటి నుంచి ఇప్పటివరకు ఇద్దరం స్నేహితులుగా కలిసే వున్నామని తెలిపారు.

## వైభవంగా కార్తీక మాస మహారుద్రాభిషేకం

కార్తీకమాస వైశిష్ట్యాన్ని పురస్కరించుకుని గత 12 సంవత్సరాలుగా చేస్తున్న మహారుద్రాభిషేకంలో భాగంగా నెల్లూరు సింహపురి ధార్మిక సంస్థ కన్వీనర్, నగర కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరి ప్రసాద్ ఆధ్వర్యంలో నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ త్యాగరాజ కళ్యాణ మండపంలో ఈ నెల 21, 22, 23 తేదీలలో కార్తీక మాస మహారుద్రాభిషేక మహోత్సవాలు వైభవంగా జరిగాయి.

ఈ నెల 21వ తేదీ సాయంత్రం అనేక టీవీ ఛానెల్స్‌లో విజేతగా నిలిచి సప్తగిరి చిరుస్వర సమరంలో ప్రథమ విజేతగా, ఈటీవీ 'పాడుతాతీయగా'లో ద్వితీయ విజేతగా నిలిచిన సర్వేపల్లి శ్రేయ, ఆమె సోదరి రాజలక్ష్మిలచే నిర్వహించిన కార్తీక మాస స్వాగత సంగీత విభావరి భక్తులను పరవశింపజేసింది. 22వ తేదీ ఉదయం 8గంటల నుండి 11మంది ఋత్వికులచే 121 రుద్రసూక్త పారాయణాలతో మహాన్యాసపూర్వక మహారుద్రాభిషేకాన్ని మహాశివునికి 11రకాల ద్రవ్యాలతో మహాభిషేకం చేసి పుష్పాభిషేకం నిర్వహించారు. పాల్గొన్న భక్తులందరికి అభిషేక తీర్థ ప్రసాదాలతో పాటు శ్రీశైలం మహాక్షేత్రం నుంచి తెప్పించిన లడ్డులను ప్రసాదంగా వితరణ చేశారు. 23వ తేదీ మహాశివ లింగంకు నగరోత్సవం కనులపండువగా జరిగింది. మహాశివ లింగానికి విశేషపుష్పాలతో అందంగా అలంకరించి ప్రత్యేకంగా



వాహనంలో ఏర్పాటు చేసిన వేదికపై ప్రతిష్టించారు. వేదపండితుల వేదమంత్రోచ్ఛారణలతో మంగళవాయిద్యాలతో నగరోత్సవం త్యాగరాజ కళ్యాణ మండపం నుంచి బయలుదేరి నగర పుర వీధుల గుండా రంగనాయకులపేట శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానానికి చేరుకుంది. అనంతరం దేవస్థానం వెనుకవైపు వున్న పెన్నానదిలో శివలింగ నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మాజీఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, డా॥ సర్వేపల్లి అజయ్ కుమార్ తదితర నగర ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

## గుంతలు పూడ్చండి

భూగర్భ డ్రైనేజీ పేరుతో నెల్లూరు నగరంలోని రోడ్లన్నింటిని తవ్వేసారు. ఈ రోడ్ల మీద వాహనాలలో పోవాలన్నా, నడవాలన్నా కష్టంగా వుంది. వర్షాలు పడితే ఇంకా ఇబ్బంది. బురదతో రోడ్లన్నీ చిందర వందరగా తయారవుతున్నాయి. ఇకనైనా తవ్విన రోడ్లను సత్వరం పూడ్చాలని మనవి.

**బి.మల్లిఖార్జున్‌గౌడ్, నెల్లూరు.**

## అసమర్థ ప్రధాని!

ఆడ లేక మద్దెల ఓడు అన్నట్లుంది ప్రధాని నరేంద్రమోడీ వ్యవహారం. పథకాలు, కార్యక్రమాలు విజయవంతమైతే ఆయన ఘనత. విఫలమైతే విపక్షాలకు కూడా భాగస్వామ్యం ఉందంటూ తన చేతగానితనాన్ని ఇంకొకరిపై రుద్దే ప్రయత్నం చేస్తున్నాడు. జిఎస్టీ అమలులో కాంగ్రెస్‌కు భాగస్వామ్యం ఉందంటూ ఆయన చేసిన చౌకబారు ప్రకటన ప్రధాని స్థాయిని దిగజార్చేదిగా వుంది. ఇలాంటి ప్రకటనలు మానుకుంటే ప్రధాని పదవికున్న గౌరవాన్ని కాపాడినవారవుతారు.

**సి.దయాకర్, పెనుబల్లి.**

## అందరూ దొంగలే!

ఏపిలో తెలుగుదేశం నాయకులందరూ తెలంగాణ సీఎం కేసీఆర్‌కు సరెండర్ అయ్యారు. ఆఖరుకు తెలంగాణ టీడీపీని కూడా కేసీఆర్‌కు తాకట్టు పెట్టేందుకు చంద్రబాబు సిద్ధమయ్యాడు. ఏపి తెలుగుదేశం నాయకులు కేసీఆర్ వద్ద కాంట్రాక్టులు, వ్యాపార లైసెన్స్‌లు పొంది ఆర్థిక ప్రయోజనాలు పొందుతుంటే తెలంగాణలో తెలుగుదేశం పార్టీ తరపున కేసీఆర్‌కు వ్యతిరేకంగా పోరాడిన రేవంత్‌రెడ్డి మాత్రం బకరా అయ్యాడు. చంద్రబాబును నమ్ముకుంటే ఎవరి గతి అయినా ఇంతే అన్నది దీని ద్వారా తేలింది. రేవంత్‌రెడ్డి ఎంత త్వరగా తెలుగుదేశం నుండి బయట పడితే అంత మంచిది.

**టి.ఎస్.పి.కృష్ణారెడ్డి, పి.ఎస్.కండ్రిక.**



# కార్పొరేట్లు... విద్యార్థుల పాట్లు

## నెల్లూరులోనూ చితకబాదుడు



**విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేయాల్సిన విద్యాసంస్థలు వారి మెడలకు ఉరితాళ్లను పేనుతుండడం బాధాకరం. విద్య పూర్తిగా వ్యాపారమైపోయిన నేటి కాలంలో కార్పొరేట్ కాలేజీలు విద్యార్థుల పాలిట కర్మాగారాలుగానే కాదు కారాగారాలుగా కూడా మారిపోయాయి. ఒక రకంగా కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులకంటే నెల్లూరు సెంట్రల్‌జైలులో జీవితశిక్ష అనుభవించే ఖైదీలే మేలేమోననిపిస్తుంది.**

ర్యాంకులు, మార్కులు, నిరంతర చదువుల ఒత్తిడి తట్టుకోలేక చాలామంది విద్యార్థులు కాలేజీల గోడలు దూకి పారిపోవడమో, పారిపోలేనివాళ్ళు ఆత్మహత్యలు చేసుకోవడమో చేస్తున్నారు. నెల్లూరుజిల్లాలోని కార్పొరేట్ విద్యాసంస్థలైన నారాయణ, శ్రీచైతన్య కాలేజీలలో ఇలాంటి సంఘటనలు చాలానే జరిగాయి. ఇటీవల నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో విద్యార్థి పి.పృధ్విసాయి కుమార్‌ను ఆ క్యాంపస్ ఇన్‌ఛార్జి శివ కర్రతో చావబాదాడు. ఈ సంఘటన తనదాకా రావడంతో ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ అధికారి బాబూజాకబ్ విచారణ జరిపించి విద్యార్థి మీద దాడి వాస్తవమేనని తేల్చాడు. విషయం బయటకొచ్చింది కాబట్టి అందరికీ తెలిసింది. ఇలా బయటకురాని దాడి సంఘటనలెన్నో వుంటున్నాయి.

కార్పొరేట్ విద్యాసంస్థలు చదువులు చెప్పే విజ్ఞాన కేంద్రాలుగా ఉండడం లేదు. అవి జైళ్ళు, విద్యార్థులు ఖైదీలు, క్యాంపస్ ఇన్‌ఛార్జులు, అధ్యాపకులు జైలు సూపరింటెండెంట్‌లు, జైలు వార్డన్‌లు అన్నట్లుగా పరిస్థితి వుంది. చదువులకు తొడిగిన వ్యాపారం ముసుగును తొలగించనంత వరకు పరిస్థితులు ఇలానే దారుణంగా వుంటాయి.



• 'పాడి' అసలే కష్టం...

# పాలధర తగ్గిస్తే ఇంకా నష్టం

*పాడి అంటే గతంలో ఎంతో సులవుగా వుండేది. ఇంట్లో 5గేదెలు వున్నా ఉదయాన్నే జంగిడికి తోలేవాళ్ళు. కాపలాదార్లు జంగిడిలో వున్న గేదెలను అడవులకు తీసుకుపోయి మేపుకుని మధ్యాహ్నానికి వచ్చేవాళ్ళు. సాయంత్రం తవుడు, కొంత గడ్డి వేస్తుంటే వాటికి సరిపోయేది. వచ్చిన కాడికి పాలు అమ్ముకున్నా ఎంతోకొంత ఆదాయం వచ్చేది.*

కాని, ఇప్పుడు పాడి చేయడమంటే మాటలు కాదు. గ్రామాలలో జంగిడి పద్ధతి పోయింది. పశువులను అడవులకు తీసుకుపోయి మేపేవాళ్ళు లేకుండా పోయారు. 24గంటలూ పశువులను ఇంటి వద్దే పెట్టుకుని మేపాలంటే ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఇంత చేసి వచ్చిన పాలను అమ్మినా వస్తున్న ఆదాయం అంతంత మాత్రంగా వుండడం, ఒక్కోసారి ఆదాయం బదులు కష్టం, నష్టం మిగులు తుండడంతో పాడి చేసే రైతులు తగ్గి పోతున్నారు. పాడిని చేద్దామా వద్దా అని రైతులు సంశయాత్మక స్థితిలో వుంటే జిల్లాలోని ప్రైవేట్ డైరీలన్నీ కలిసి రైతుల నుండి సేకరించే పాల ధరను సాలీనా లీటర్‌కు(10శాతం వెన్న) రెండున్నర రూపాయలు తగ్గించడం పాడి రైతాంగాన్ని విస్మయానికి గురి చేస్తోంది. జిల్లాలో 3 లక్షల పాడిరైతు కుటుంబాలున్నాయి. ఒక్కో కుటుంబం రోజుకు 10లీటర్ల లెక్కన పాలు అమ్మినా నెలకు 300లీటర్లు. లీటరు మీద రెండున్నర రూపాయి తగ్గిస్తే నెలకు 750 రూపాయల రాబడి పోయినట్లే! రైతులకు ఖర్చులేమీ తగ్గవు. రోజురోజుకూ పెరగడం తప్పితే! డెయిరీలో ఇలా రైతులకు ఇచ్చే రేట్లను ఉన్నట్లుండి తగ్గిస్తే, పాడినే నమ్ము కున్న రైతులు ఏం కావాలి. ఇలాంటి సమయాల్లోనే ప్రభుత్వ డెయిరీలు రైతులను ఆదుకునే దిశగా ముందుకొచ్చి తమ వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవాలి.

# ఆక్రమణలకు అభయం!



స్థలాలను ఆక్రమించుకుని వున్నారా... వెంటనే క్రమబద్ధీకరించుకోండి... ఇదీ ప్రభుత్వం ప్రకటిస్తున్న ఆఫర్.

ఆక్రమణలకు, ఆక్రమణదారులకు అభయహస్తం ఆక్రమణల క్రమబద్ధీకరణ కార్యక్రమం. గత కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఈ సంస్కృతి మొదలుకాగా, నేటి తెలుగుదేశం ప్రభుత్వం కూడా దానిని కొనసాగిస్తోంది. ప్రభుత్వ స్థలాలను, ఇరిగేషన్ కాలువల స్థలాలను, ఇతర పోరంబోకు తాజాగా ఆక్రమణదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఈ బంపర్ ఆఫర్‌ను ప్రకటించింది. 2014 జనవరికి ముందు ఆక్రమించుకున్న స్థలాలను క్రమబద్ధీకరించుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వం జి.ఓ విడుదల చేసింది. నెల్లూరు కార్పొరేషన్‌తో పాటు కావలి, గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, నాయుడుపేట, ఆత్మకూరు మున్సిపాల్టీల పరిధిలో ఆక్రమణలకు ఈ జి.ఓ వర్తిస్తుంది. 23వ తేదీ నుండి ఆక్రమణల క్రమబద్ధీకరణ మొదలుపెట్టారు. మొత్తం 10రోజుల్లో ఈ తంతును ముగించాలని అధికారులు నిర్ణయించారు. ఆక్రమణదారుల నుండి ఫీజులు వసూలు చేసి తర్వాత వారికి పొజిషన్ సర్టిఫికేట్‌లు మంజూరు చేయనున్నారు. నాలుగు రూపాయలు ఖర్చయినా ఆక్రమణదారులకు ఇది ఒక భరోసా.

## దేశాన్ని కాపాడే సైనికులు...

# దైవంతో సమానం

**ఎమ్మెల్యే అనిల్**



రాత్రనక, పగలనక దేశ సరిహద్దుల్లో ఉంటూ దేశానికి రక్షణగా ఉండే మన వీరజవాన్లు దైవంతో సమానమని నెల్లూరు నగర శాసనసభ్యులు డా.పి. అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. పోలీసు అమరవీరుల దినోత్సవం సందర్భంగా నెల్లూరు నగరంలోని మూలాపేటలో ఉన్న ఇవిఎస్‌ఆర్‌ఎం మునిసిపల్ హైస్కూలులో ఆ స్కూలు పూర్వవిద్యార్థి బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్‌లో ఉంటూ అమరుడైన మస్తాన్‌బాషా చిత్రపటానికి ఎమ్మెల్యే పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎంతోమంది జవాన్లు తమ కుటుంబాలను సైతం నెలల తరబడి వదిలేసి, రేయింబవళ్ళు ప్రాణాలకు తెగించి దేశ సరిహద్దులను కాపాడుతున్నారని అన్నారు. అలాంటి వీరజవాన్లను చూసినప్పుడు వారి దేశభక్తి ఎంత గొప్పదో అర్థమవుతుందన్నారు. భారతదేశపు ఆర్మీ ప్రపంచంలోకెల్లా మూడవ స్థానంలో ఉండడం గర్వకారణమన్నారు. దేశ రక్షణ కోసం ప్రతిఒక్కరూ తమ శక్తిమేరకు ఆర్మీకి ఫండ్స్ ఇవ్వాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను రకరకాల కోర్సులు చదివిస్తున్నారని, అయితే, దేశాన్ని కాపాడేందుకు వీరజవాన్‌గా పంపాలని అనుకోవడం లేదని అంటూ, విద్యాసంస్థలు విద్యార్థుల్లో ఆత్మస్థైర్యాన్ని నింపి దేశభక్తిని పెంపొందిస్తే మన దేశం మూడవస్థానం నుంచి మొదటి స్థానానికి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్సీపి మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, కార్పొరేటర్ గోగుల నాగరాజు, వైఎస్సార్సీపి నాయకులు ఎ.జనార్ధన్‌రెడ్డి, పి. సునీల్, వడ్లమూడి చంద్ర, పూజారి రామకృష్ణ, చిట్టి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ పరువు తీశాడు

## మహిళా సర్పంచ్‌తో అసభ్యంగా మాట్లాడి సస్పెండైన ఎస్.ఐ

**కామం కళ్లకు ఎక్కితే ఎలాంటి వాళ్ళ బ్రతుకులైనా తారుమారు కావాల్సిందే. పేరుప్రతిష్టలు మట్టి కొట్టుకు పోవాల్సిందే! ఒక ఎన్.డి.తివారి... ఒక దేరా బాబా... ఎంతో పేరుమోసిన ఇలాంటి వాళ్లెందరో కేవలం నరాల బలహీనత వల్లే దెబ్బతిన్నారు.**

బాధ్యతాయుతమైన ఎస్.ఐగా వుండి... ఒక మహిళా ప్రజాప్రతినిధి పట్ల అగౌరవంగా, అసభ్యంగా వ్యవహరించి ఫోన్ సంభాషణల ద్వారా పట్టుబడి సస్పెండ్‌కు గురయ్యాడో ప్రబుద్ధుడు. ఆయనే సైదాపురం ఎస్.ఐ ఏడుకొండలు.

వివరాలలోకి వెళితే.. సైదాపురం మండలం ఊటుకూరు సర్పంచ్ మంచు పద్మజ కుటుంబానికి, అదే గ్రామంలో మోడుబోయిన సుబ్బారావు కుటుంబానికి మధ్య 30సెంట్ల భూమి వివాదం నడుస్తోంది. ఇరు కుటుంబాలు దీనిపై కోర్టులో కేసులు వేసుకున్నాయి. 2015 జులై నెలలో ఏడుకొండలు సైదాపురం ఎస్.ఐగా వచ్చాడు. మోడుబోయిన సుబ్బారావు కుటుంబసభ్యులు కేసు విషయమై ఎస్.ఐకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని కోర్టుకెక్కి ఆర్డర్స్ తెచ్చారు. కోర్టు ఆదేశాలతో ఎస్.ఐ ఏడుకొండలు మంచు పద్మజ, ఆమె కుటుంబసభ్యులు జయరామయ్య, వెంకటేశ్వర్లు, దినేష్, శేషాద్రి, శ్రీనివాసులులపై ఈ ఏడాది ఏప్రిల్ 23వ తేదీన కేసు నమోదు చేసారు. వీరిలో సర్పంచ్ పద్మజకు మాత్రం స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపాడు. తదుపరి విచారణ నేపథ్యంలో ఈ నెల 18న పద్మజను తప్ప మిగిలిన 5మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపాడు. పద్మజ మీద మనసుపడ్డ ఎస్.ఐ కేసు విచారణ పేరుతో తరచూ వాళ్ళింటికెళ్ల సాగాడు. ఆమెతో ఒంటరిగా మాట్లాడడానికి ప్రయత్నించేవాడు. ఆమె ఫోన్ నెంబర్ తీసుకుని... ఫోన్‌లో మాట్లాడసాగాడు. నీ ఫిట్‌నెస్ బాగుంది... యోగా చేస్తావా? నీ కొడుకు హాస్టల్‌లో వుంటాడా... మీ కొడుకు ఇంట్లో వుంటే కలవాలంటే కష్టం కదా? ఇంట్లో వద్దులే... గూడూరులోగాని నెల్లూరులోగాని లాడ్జి తీసుకుందాం... గూడూరులో కూడా వద్దు నీకు తెలిసిన వాళ్లుంటారు, నెల్లూరే బెస్ట్. ఒకసారి నెల్లూరులో కలుద్దాం... ఇన్ని మాట్లాడిన ఎస్.ఐ చివరిలో... ఫోన్ ఏమీ రికార్డు చేయడం లేదుకదా అనే అనుమానాన్ని కూడా వ్యక్తం చేశాడు. ఆమె లేదని చెప్పడంతో ఫోన్ పెట్టేసాడు. సంభాషణల్ని రికార్డు చేసిన పద్మజ ఇటీవల ఎస్పీ రామకృష్ణను కలిసి వినిపించింది. ఆయన వెంటనే ఎస్.ఐను వీఆర్‌కు ఆదేశించి, అతనిపై విచారణ జరపమని గూడూరు డిఎస్పీ రాంబాబును ఆదేశించారు. రాంబాబు విచారణ జరిపి మహిళా సర్పంచ్ పద్మజపై లైంగిక వేధింపులు నిజమేనని రిపోర్ట్ ఇవ్వడంతో ఏడుకొండలును సస్పెండ్ చేశారు. పోలీసులంటే ప్రజలకు భరోసా, ఓ నమ్మకం. తమ మాన, ప్రాణాలకు కాపలకాసే కంచె లాంటి వారనే అభిప్రాయం. ఆ కంచె చేనును మేస్తే... ఇక బాధలు ఎవరికి చెప్పుకోవాలి.

# నెల్లూరు కబుర్లు



## ఆరోగ్యంగా వెంకయ్య

భారత ఉపరాష్ట్రపతి, నెల్లూరు ముద్దుబిడ్డ ముప్పవరపు వెంకయ్యనాయుడు ఇటీవల అస్వస్థకు గురికావడంతో వెంటనే ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు. గుండెకు రక్తం సరఫరా చేసే రక్తనాళాలలో ఒకటి బ్లాక్ అయినట్లు గుర్తించి వైద్యులు స్టంట్ అమర్చారు. ఆయనకు అనారోగ్యం అని తెలియగానే నెల్లూరుజిల్లాలో ఆయన ఆప్తులు, అభిమానులు ఆందోళన చెందారు. స్టంట్ వేసిన తర్వాత ఆయన ఆరోగ్యంగా చలాకీగానే వున్నారు. అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

## నెల్లూరు గుళ్లలో ఎన్నికల కమిషనర్



తెలుగు రాష్ట్రాల ఎన్నికల కమిషనర్ భన్వర్‌లాల్ 24వ తేదీన నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానాన్ని అలాగే రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథ స్వామి దేవస్థానాన్ని సతీసమేతంగా సందర్శించారు. రాజేశ్వరమ్మ గుడిలో ఇ.ఓ పులి కోదండరామిరెడ్డి, ప్రధానార్చకులు తంగిరాల రాధాకృష్ణశర్మలు వారికి స్వాగతం పలికి అమ్మవారి సన్నిధిలో పూజలు నిర్వహించారు. అలాగే రంగనాయకుల స్వామి గుడిలో ఆలయ కమిటీ ఛైర్మెన్ మంచికంటి సుధాకర్‌రావు, ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, ప్రధానార్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు వారికి స్వాగతం పలికి పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. భన్వర్‌లాల్ దంపతులు ఆ తర్వాత జొన్నవాడకెళ్లి శ్రీ కామాక్షితాయి మల్లిఖార్జునస్వామి దేవస్థానంలో కూడా పూజలు నిర్వహించారు.

## రెయిన్‌బోలో ఫ్యామిలీ డే



నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని రెయిన్‌బో పాఠశాలలో కుటుంబ దినోత్సవాన్ని ఈ నెల 21వ తేదీన ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, తల్లిదండ్రులు సంప్రదాయ దుస్తులతో ఆకట్టుకున్నారు. పాఠశాల డైరెక్టర్ పద్మసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రస్తుత వేగవంతమైన ప్రపంచంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ క్షీణించి పిల్లల్లో విలువలు, పెద్దల పట్ల గౌరవం లోపిస్తున్నాయన్నారు. వాటిని పిల్లలకు తెలియజేసేందుకే ఈ కార్యక్రమాన్ని పాఠశాలలో చేపట్టామన్నారు. కిండర్‌గార్డెన్ టీం లీడర్ ఫాతిమాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

### మన ఎమ్మెల్యే-మన ఇంటికి...

## విజయవంతం కోసం పూజలు



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ప్రారంభించిన 'మన ఎమ్మెల్యే-మన ఇంటికి' కార్యక్రమం విజయవంతం కావాలని కోరుకుంటూ వైఎస్సార్సీపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఈనెల 23న శివాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ రావినూతల మధు మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి వెళ్ళి ప్రతిఒక్కరిని పలుకరిస్తూ, ప్రజల సమస్యలను తెలుసుకోవాలని 105 రోజుల పాటు రూరల్ శాసనసభ్యుడు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ కార్యక్రమం ప్రారంభించారని, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషిచేస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డికి ఆ భగవంతుడు ఆయురారోగ్యాలు ప్రసాదిస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు ఆశీస్సులు అందజేయాలని ఈ కార్తీక మాసం పర్వదినాన ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటరమణ, రఫీ, నవీన్, వెంకటేష్, ప్రశాంత్, అఖిల్, శ్రీకాంత్, విజయ్, వంశీ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

### భారత ఉపరాష్ట్రపతి చేతుల మీదుగా ...

## 'మాట' ఆంగ్లానువాదం ఆవిష్కరణ



ప్రపంచాన్ని శాసించేది 'తూటా' కాదు... 'మాట'. దీనికి వున్న శక్తి అణుబాంబులకు ఉండదు, హైడ్రోజన్ బాంబులకు ఉండదు, సునామీకి ఉండదు. ఒక్క 'మాట'తోనే ప్రపంచంలోని అన్ని వ్యవస్థలు నడుస్తుంటాయి. అయితే ఈ 'మాట'కున్న శక్తిని కనిపెట్టినవాడే నెల్లూరుకు చెందిన ప్రముఖ కవి చిన్ని నారాయణరావు. ఆడిటింగ్ ఆయన వృత్తి అయినా, అక్షర సేద్యం ఆయన ప్రవృత్తి. ఈ అక్షర సేద్యంలోనే ఎన్నో కవితలను, కవితా సంకలనాలను పండించిన ఆయన ఆ పరంపరలోనే 'మాట' అనే కవితా సంపుటిని పండించడమే కాదు, పాఠకులకు అక్షర నైవేద్యంగా పంచారు కూడా! 'మాట'కున్న శక్తిని, మాటకున్న విలువను, మాటకున్న పరపతిని తెలియజేస్తూ ఆయన రచించిన 'మాట' దీర్ఘకవిత రాష్ట్ర వ్యాప్తంగా విశేషప్రాచుర్యం పొందింది. 'మాట'కున్న శక్తిని తెలుగేతరులకు కూడా తెలియజెప్పాలన్న ఉద్దేశ్యంతో 'మాట' దీర్ఘ కవితను 'ది వర్డ్' పేరుతో ఇంగ్లీష్‌లోకి అనువదించారు. 'మాట' ఆంగ్లానువాదమైన 'ది వర్డ్' పుస్తకాన్ని నవంబర్ 3వ తేదీన న్యూఢిల్లీలోని ఉపరాష్ట్రపతి భవన్‌లో ఉపరాష్ట్రపతి యం.వెంకయ్యనాయుడు ఆవిష్కరించనున్నారు.

'మాట'కే కాదు, ఆ పేరుతో వ్రాసిన కవితకు కూడా ఎంత శక్తి వుందన్నదానికి ఆ కవితా సంపుటిని ఉపరాష్ట్రపతి ఆవిష్కరిస్తుండడమే నిదర్శనం.

## ఎస్పీ సి.సిగా మురళి

నెల్లూరుజిల్లా ఎస్పీ క్యాంప్ క్లర్క్‌గా ఎం.మురళీకృష్ణసింగ్ 21వ తేదీన బాధ్యతలు చేపట్టారు. మురళీకృష్ణ గతంలో ఆత్మకూరు, నెల్లూరు నగరం డిఎస్పీల వద్ద సి.సిగా పని చేసాడు.

## డిప్యూటీ కలెక్టర్‌గా రోజ్‌మాండ్

కోట తహశీల్దార్‌గా పనిచేస్తున్న రోజ్‌మాండ్‌కు విజిలెన్స్ సివిల్ సప్లయిస్ డిప్యూటీ కలెక్టర్-1గా పదోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం నుండి ఉత్తర్వులు వెలువడ్డాయి.

### డి.కె. ప్రిన్సిపాల్‌కు

## మంచి గుర్తింపు

నెల్లూరులోని డి.కె.ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మస్తానయ్యను రాష్ట్ర ప్రభుత్వం 'స్టేట్ లెవల్ క్వాలిటి అస్యూరెన్స్ కో-ఆర్డినేట్ కమిటి'లో సభ్యుడిగా నియమించింది. రాష్ట్రంలో 165 డిగ్రీ కళాశాలలుండగా నెల్లూరు డికెడబ్ల్యూ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ మస్తానయ్యకే ఈ గౌరవం దక్కడం అభినందనీయం.

## 21వ డివిజన్‌లో స్వచ్ఛభారత్

నెల్లూరు నగరంలోని 21వ డివిజన్ పరిధిలో ఉన్న స్నేహనగర్‌లో కార్పొరేటర్ నూనె మల్లికార్జునయాదవ్ ఆధ్వర్యంలో ఈనెల 21న స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జునయాదవ్ మాట్లాడుతూ, పరిసరాలను ప్రజలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మధు, నవీన్, లక్ష్మి ప్రసన్న, ఏవిఆర్ తదితరులు పాల్గొన్నారు.

## విపిఆర్‌విద్యలో 'కార్తీక' శోభ



చిన్నారులలో విద్యా బోధనతో పాటు ఆధ్యాత్మిక తత్పరతను, భగవత్‌నామస్మరణం ప్రాధాన్యతను పెంపొందించాలనే లక్ష్యంతో నెల్లూరు, కనుపర్తిపాడులోని విపిఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విపిఆర్ విద్య ప్రాంగణంలో



అక్టోబర్ 24వ తేదీ కార్తీక దీపారాధనతో పాటు ఇస్కాన్ శ్రీ జగన్నాథ మందిరం వారి నేతృత్వంలో పూజలు, హరేరామ హరేకృష్ణ నామ సంకీర్తన జరిగింది. విపిఆర్ ఫౌండేషన్ సి.ఇ.ఓ ఆచార్య వి.నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## చిన్నారి గుండెకు శస్త్ర చికిత్స




నెల్లూరులోని కిమ్స్(బొల్లినేని) సూపర్ స్పెషాలిటి ఆసుపత్రిలో ఐదేళ్ళ చిన్నారి గుండెకు అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. ప్రముఖ గుండె వైద్య నిపుణుడు శ్రీనివాసరాజు ఈ నెల 21వ తేదీన విలేకర్లతో మాట్లాడుతూ ప్రకాశం జిల్లాకు చెందిన ఐదేళ్ళ కుమారి పుట్టుకతోనే గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోందని, పూర్తిస్థాయి పరీక్షలు నిర్వహించగా చిన్నారి గుండె కొట్టుకునేటప్పుడు రక్తం ఎడమ జఠరిక నుంచి కుడి జఠరికలోకి అపసవ్య దిశలో వెళుతున్నట్లు గుర్తించామన్నారు. అరుదైన ఈ వ్యాధిని వెంట్రల్ సెప్టెల్ డిసెక్ట్(విఎస్‌డి)గా పిలుస్తారన్నారు. రూ.3లక్షలు ఖర్చయ్యే ఈ చికిత్సను ఎన్టీఆర్ వైద్యసేవా పథకం క్రింద ఇచ్చిన నిధులు సరిపోకపోతే కిమ్స్ ఆసుపత్రి యాజమాన్యం ఉచితంగా చేసిందన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవా పథకం జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ దయాకర్ ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస రాజును సన్మానించారు.

## స్విమ్మింగ్‌లో 19మందికి బంగారు పతకాలు





రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో నెల్లూరుజిల్లా తరపున 19మంది బంగారు పతకాలు సాధించడం అభినందనీయమని నెల్లూరుజిల్లా కలెక్టర్ రేవు ముత్యాలరాజు అన్నారు. నెల్లూరు నగరంలోని సిఎంఆర్ షాపింగ్‌మాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విజేతలను ఈ నెల 21వ తేదీన అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయసుతో సంబంధం లేకుండా పినాకిని స్విమ్మర్స్ అసోసియేషన్ తరపున పోటీల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో బంగారు, కాంస్య పతకాలు సాధించడం జిల్లాకే గర్వకారణమన్నారు. అలాగే ఏసి స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ఢిల్లీరావు స్విమ్మర్స్‌ను అభినందించారు. ఈ కార్యక్రమాల్లో సిఎంఆర్ అధినేత మావూరి శ్రీనివాసరావు, రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, కార్పొరేటర్ పి.రూప్‌కుమార్‌యాదవ్, స్విమ్మర్స్ అసోసియేషన్ సభ్యులు, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# నెల్లూరు పరువు తీసావు!

## కాకాణిపై బీద ఫైర్

తప్పుడు ఆరోపణలకు పాల్పడి రాజకీయంగా ఎంతో మంచి పేరున్న నెల్లూరుజిల్లా పరువు తీసావంటూ తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై మండిపడ్డారు. 23వ తేదీన నెల్లూరులోని ఎన్టీఆర్‌భవన్‌లో విలేకరుల సమావేశం పెట్టి కాకాణిని తిట్టారు. మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి విదేశాలలో ఆస్తులున్నాయంటూ తప్పుడు ఆరోపణలు చేసి ఏ ఒక్కటీ నిరూపించలేకపోయిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి వెంటనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని బీద డిమాండ్ చేశారు. సోమిరెడ్డిపై కాకాణి చేసిన ఆరోపణలు, చూపించిన డాక్యుమెంట్లు అన్నీ తప్పుడివని తేలాయి. జిల్లాలో ఇంతవరకు ఏ రాజకీయ నాయకుడూ ఇంతగా దిగజారలేదని ఆయన అన్నారు. నైతిక బాధ్యత వహించి ఎమ్మెల్యే పదవికి కాకాణి రాజీనామా చేయకుంటే స్పీకర్‌ను కలిసి ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని కోరుతామన్నారు. అలాగే నకిలీ వీసాల డాక్యుమెంట్లు సృష్టించి సింగపూర్, మలేషియా ప్రభుత్వాలను మోసం చేసినందుకు కాకాణిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు. కాకాణి నకిలీ డాక్యుమెంట్ల వ్యవహారంలో వైసిపి కూడా వివరణ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో నుడా ఛైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఆసుపత్రి అభివృద్ధి కమిటి ఛైర్మెన్ చాట్ల నరసింహారావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి డాక్టర్ జడ్.శివ ప్రసాద్, బి.సి.సెల్ అధ్యక్షులు పి.ఎల్.రావు, కార్పొరేటర్ నూనె మల్లిఖార్జున యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల విధి నిర్వహణ..

# కత్తిమీద సామే

**- నెల్లూరుజిల్లా కలెక్టర్ ముత్యాలరాజు**



పోలీసుల విధి నిర్వహణ కత్తిమీద సామేనని నెల్లూరుజిల్లా కలెక్టర్ రేవు ముత్యాల రాజు అన్నారు. ఈ నెల 21వ తేదీ నెల్లూరు పోలీసు పెరేడ్‌గ్రౌండ్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశ, సమాజ రక్షణలో తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పిస్తున్న పోలీసు అమరవీరుల త్యాగనిరతి అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. సమాజంలో అంతర్గత శాంతభద్రతల పరిరక్షణకు పోలీసులు నిత్యం పోరాడుతూనే ఉంటారన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం, మతతత్వం, ఫ్యాక్షనిజం వంటి విచ్ఛిన్నకర శక్తులతో పోరాడుతూ సమాజ నిర్మాణానికి కంకణబద్ధులై అమరులవుతున్నారన్నారు. వారి త్యాగం అజరామరం అన్నారు. ఏఎస్పీ బి.శరత్‌బాబు మాట్లాడుతూ ఈ ఏడాది శాంతిభద్రతల పరిరక్షణలో దేశవ్యాప్తంగా 833మంది పోలీసు సిబ్బంది అసువులు బాసారన్నారు. అందులో రాష్ట్రానికి చెందిన వారు 6మంది ఉన్నారన్నారు. అనంతరం కలెక్టర్ ముత్యాలరాజు, ఏఎస్పీలు బి.శరత్ బాబు, వీరభద్రుడు, క్రైం ఓఎస్‌డి టి.పి.విఠలేశ్వర్, డిఎస్పీలు ఎన్.కోటారెడ్డి, ఎన్‌బిఎం మురళీకృష్ణ, బాల సుందరం, శ్రీనివాసరావు, కె.శ్రీనివాసరావు, ఏ.పి పోలీసుల అధికారులసంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిపాటి ప్రసాదరావు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, అమరవీరుల స్థూపం వద్ద పుష్పగుచ్ఛాలు వుంచి శ్రద్ధాంజలి ఘటించారు. అమరవీరుల స్మృత్యర్థం పెరేడ్‌ను నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లోను, వివిధ రకాల పోటీల్లోను గెలుపొందిన వారికి, విధి నిర్వహణలో ప్రతిభ చూపిన వారికి కలెక్టర్ బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు.



# జనం జ్వరంతో చస్తున్నారు

## జడ్పీ సమావేశంలో సభ్యుల ఆవేదన




నెల్లూరుజిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం 24వ తేదీ జడ్పీ సమావేశ మందిరంలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగింది. సమావేశంలో సభ్యులు జిల్లాలో ప్రబలిన విషజ్వరాలపై ఎక్కువుగా మాట్లాడారు. జ్వరంతో జనం చస్తుంటే అధికారులు పట్టించుకోవడం లేదంటూ ఆవేదన వ్యక్తం చేశారు. డెంగీ చికిత్సకు అవసరమైన ప్లేట్‌లెట్స్‌ను తయారుచేసే యంత్రాలు తక్కువుగా వున్నాయని, సకాలంలో ప్లేట్‌లెట్స్ దొరక్క ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు చెప్పగా, ఈ యంత్రాలను ఎక్కడికక్కడ అందుబాటులోకి తేవడానికి నిధులు సమకూరుస్తామని వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా అమాయక ప్రజలు జ్వరాలకు ప్రాణాలు కోల్పోతున్నారని, జ్వరాలతో ఎంతమంది చనిపోయారన్న లెక్క కూడా జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారుల వద్ద లేదని జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. జ్వరాలు ప్రబలకుండా చేపట్టాల్సిన చర్యలపై సభ్యులు వైద్యఆరోగ్యశాఖ, పంచాయితీ రాజ్, గ్రామీణ నీటి సరఫరా, మలేరియా శాఖ అధికారులతో ఒకేసారి చర్చించారు. ప్రతి నియోజకవర్గంలో ప్లేట్‌లెట్లను తయారుచేసే యంత్రాలను ఏర్పాటు చేయాలని, కలెక్టర్ వీటికి నిధులు సమకూర్చాలని, అక్కడ నుండి రాకుంటే నియోజకవర్గాల ప్రజాప్రతినిధులే సమకూర్చుకోవాలని నిర్ణయించారు. సమావేశంలో ఇంకా ఇసుక రవాణా, బ్యాంకుల ఋణాలు, సాగునీరు, అక్రమ మైనింగ్ వంటి అంశాలపై వాడివేడిగా చర్చించారు.

సమావేశానికి ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, బీద రవిచంద్ర, యండపల్లి శ్రీనివాసులురెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు కాకాణి గోవర్ధన్‌రెడ్డి, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, పాశం సునీల్‌కుమార్, కిలివేటి సంజీవయ్య, రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, మేకపాటి గౌతంరెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, జేసీ ఇంతియాజ్‌అహ్మద్, జడ్పీటీసీలు, ఎంపీపీలు హాజరయ్యారు.



# అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేస్తాం

**- నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు**



నెల్లూరుజిల్లాలోని అగ్రిగోల్డ్ డిపాజిట్ దారులందరికి న్యాయం చేసేందుకు పోలీసుశాఖ అన్ని ప్రయత్నాలు చేస్తోందని తాము తెలిపిన సూచనలు ప్రతిఒక్కరు పాటించాలని నోడల్ ఆఫీసర్ శ్రీనివాసులు కోరారు. ఈ నెల 21న నెల్లూరులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకున్నవారితో పాటు సి.ఐ.డి కార్యాలయంలో నమోదు చేయించుకున్న వారికి, గతంలో నమోదు చేసుకోని వారికి కూడా నమోదు అవకాశం కల్పించామన్నారు. నెల్లూరుజిల్లా ఎస్పీ రామకృష్ణ ఆదేశాలతో జిల్లాలో 14 సెంటర్లలో 52 కౌంటర్లు ఏర్పాటు చేసి వెరిఫికేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నామన్నారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటి బిడ్డల తల్లులకు అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. రాష్ట్ర అగ్రిగోల్డ్ డిపాజిటర్లు అయి ఉండి ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన బాధితుల వివరాలు కూడా నమోదు చేస్తున్నామని తెలిపారు. బాధితులంతా తమ వద్దనున్న అన్ని ఆధారాలను సమర్పించాలని కోరారు. ఈ ప్రక్రియ నవంబర్ 24వ తేదీ వరకు జరుగుతుందన్నారు.

# 'ఫిదా' కారు విజేత శ్రీనివాస్



విజయదశమి, దీపావళి పర్వదినాల సందర్భంగా నెల్లూరులోని సిఎంఆర్ చందన బ్రదర్స్‌లో నిర్వహించిన ఫిదా సేల్స్ అమ్మకాల కోసం ప్రకటించిన బంపర్ ప్రైజ్ కారు విజేత లక్కీడ్రా కార్యక్రమం ఈ నెల 21వ తేదీ రాత్రి జరిగింది. ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ముత్యాలరాజు పాల్గొని కారు విజేతను, డైలీ డ్రా విజేతలను ప్రకటించారు. కారు విజేత పి.ఎల్.శ్రీనివాస్‌ను కలెక్టర్ ఫోన్‌లో పలకరించి అభినందనలు తెలిపారు. నాలుగు, ఐదు వారాల లక్కీ డ్రా స్కూటర్ విజేతలకు స్కూటర్‌లను అందజేశారు. అనంతరం డైలీ డ్రా విజేతలు 9మందికి గృహోపకరణాలు అందజేశారు. సిఎంఆర్ షాపింగ్‌మాల్ అధినేత మావూరి శ్రీనివాసరావును ప్రత్యేకంగా కలెక్టర్ అభినందించారు. రాజీయాడ్స్ అధినేత మోపూరు పెంచలయ్య, స్విమ్మర్స్, సిబ్బంది పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

# గీతాంజలిలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



జిల్లాలోని ప్రముఖ ఇంజనీరింగ్ కళాశాల గీతాంజలి ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఈనెల 21న కళాశాల పూర్వవిద్యార్థులు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్, కొచ్చిన్, పూణేల్లో స్థిరపడిన గీతాంజలి పూర్వవిద్యార్థులు సమారు 300 మందికి పైగానే హాజరయ్యారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. జి.సుబ్బారావు మాట్లాడుతూ, పూర్వ విద్యార్థుల సమావేశానికి ఇంతమంది విద్యార్థులు రావడం సంతోషకరమన్నారు. తమ కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఉన్నతస్థానాల్లో ఉండడం తమకెంతో గర్వకారణమన్నారు. కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఎన్.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వవిద్యార్థులకు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు పటిష్టమైన స్నేహ సంబంధాలను పెంపొందించడానికి, సీనియర్ విద్యార్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు చేస్తూ తాము ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సవాళ్ళను, పోటీని, జూనియర్ విద్యార్థులకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాల పూర్వవిద్యార్థుల సంఘానికి కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో డా.టివిఎల్ఎన్ కుమార్, డా. ఎస్‌కె బాషా, డా.వై.జాహ్నవి, డా. టి.సునీల్‌కుమార్, పి.రాఘవరెడ్డి, ప్రకాష్, డా.చక్రపాణి, డా.సిహెచ్ వీరాంజనేయులు, యస్.శ్రీధర్, చైతన్య, వై.దినకర్, కె.విజయ ప్రసంగించారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇస్కాన్‌లో 'గోవర్ధన పూజ'



నెల్లూరులోని ఇస్కాన్ సిటీలో ఉన్న శ్రీకృష్ణ మందిరంలో ఈనెల 20న ఎంతో వైభవంగా గోవర్ధన పూజ నిర్వహించారు. దీపావళి తర్వాత రోజున వచ్చే ఈ పర్వదినం ప్రాచీనకాలం నుంచి మనదేశంలో ఎంతో వేడుకగా జరుగుతోందని, గోవర్ధన పూజ ద్వారా ఆధ్యాత్మిక వికాసం కలుగుతుందని ఈ సందర్భంగా మందిరం నిర్వాహకులు శ్రీ శుకదేవస్వామి అన్నారు. ఆధునిక కాలంలో గ్రామీణ జీవితాన్ని, గో సంరక్షణను నిర్లక్ష్యం చేస్తున్నారని, అందువల్ల అనారోగ్యం, సమాజంలో అశాంతి వాతావరణం అలముకుంటున్నాయని, సాక్షాత్తూ శ్రీకృష్ణ భగవానుడు అయిదువేల ఏళ్ళ క్రితమే ప్రారంభించిన ఈ గోవర్ధన పూజ సమాజంలో శాంతిని, ఆధ్యాత్మికకాంతిని వెల్లివిరిసేలా చేస్తుందని ఆయన పేర్కొన్నారు. గోసంరక్షణ ద్వారా, గోఆధారిత సేద్యం ద్వారా భూసారం పెంపొందించుకోవచ్చన్నారు.



# భక్తిశ్రద్ధలతో నాగులచవితి

కార్తీకమాసం శుక్లపక్షంలో వచ్చే నాగచతుర్థి, నాగపంచమి, నాగషష్ఠి ఈ మూడు రోజులు నాగపూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సర్పదోషం, కాలసర్పదోషం ఉంటే ఈ వ్రతం చేయడం ద్వారా తొలగిపోతాయని పురాణాలు చెపుతున్నాయి. ఈ నెల 23వ తేదీ కార్తీక సోమవారం రోజు నాగులచవితి రావడం విశేషం. నాగులచవితి సందర్భంగా మహిళా భక్తులు అధికసంఖ్యలో పుట్టలవద్ద విశేషపూజలు, నోములు నోచుకున్నారు. నెల్లూరు మూలాపేట శ్రీకృష్ణ ధర్మరాజు స్వామి దేవస్థానంలోని నాగులపుట్ట, పాతపెద్దాసుపత్రి సమీపంలోని పొర్లుకట్ట ప్రాంతంలో ఉన్న శ్రీ నాగళ్ళ పరమేశ్వరి అమ్మవారు, నిప్పోసెంటర్‌లోని నాగేంద్రస్వామి పుట్ట, పొదలకూరురోడ్డు డైకస్‌రోడ్డు సెంటర్ వద్దనున్న నాగులపుట్ట వద్ద మహిళలు అధికసంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. పుట్టల చుట్టూ దారాలు చుట్టి కోడిగుడ్లను, పాలను పుట్టలో పోసారు. సజ్జలు, నలిమిడిపిండి నైవేద్యం పెట్టి నాగరాజస్వామి పాటలు పాడి విశేషపూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు పుట్టలవద్ద క్యూలైన్లు, విద్యుద్దీపాలంకరణ, తదితర ఏర్పాట్లు చేసారు.

## డాక్టర్ పెళ్ళకూరు జయప్రదకు
# సాహితీ పురస్కారం



ప్రముఖ సాహితీవేత్త, సీనియర్ రచయిత్రి డాక్టర్ పెళ్ళకూరు జయప్రద విశిష్ట సాహితీ పురస్కారం అందుకున్నారు. ఈ నెల 21వ తేదీ విజయవాడ ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో ఆంధ్ర నాటక కళాసమితి వారు జయప్రదను సత్కరించారు. సన్నపనేని నాగేశ్వరరావు, భాగ్యలక్ష్మి పేరిట ఇచ్చే అవార్డును ఈ ఏడాది జయప్రదకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ పురస్కారం తనకు అందజేయడం ఆనందంగా ఉందన్నారు. సంస్థ వ్యవస్థాపకులు కర్నాటి లక్ష్మీనరసయ్య, డాక్టర్ కామినేని పట్టాభిరామయ్య, జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ పి.వి.రమణకుమార్, డాక్టర్ రెజీనా పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

# రెవెన్యూ సమస్యలు తీర్చండి



ఆర్డీవోతో చర్చిస్తున్న ఎమ్మెల్యే సునీల్

గూడూరు నియోజకవర్గంలోని సమస్యలను తక్షణం పరిష్కరించేలా రెవెన్యూ అధికారులు చొరవ తీసుకోవాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ గూడూరు ఆర్డీవో అరుణ్‌బాబును కలిసి వివరించారు. గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం గ్రీవెన్స్‌డే సందర్భంగా పలు ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల సమస్యలపై ఆర్డీవోను కలిసి చర్చించారు. గూడూరు, కోట, వాకాడు, చిట్టమూరు, చిల్లకూరు తదితర మండలాల్లోని గ్రామాల్లో రెవెన్యూ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతూ తిరుగుతున్నారని, వీటన్నింటిని పరిశీలించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే వెంట పలువురు నియోజకవర్గ ప్రతినిధులు ఉన్నారు.

## విద్యార్థులకు రోటరీ స్కాలర్‌షిప్స్



గూడూరు పట్టణంలోని రోటరీ భవన్‌లో తొమ్మిది మంది ఇంజనీరింగ్, పీజీ చదివే విద్యార్థులకు దొడ్ల రుక్మిణమ్మ రోటరీ స్కాలర్‌షిప్స్‌ను ఆదివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ అధ్యక్షుడు మునిరాజా మాట్లాడుతూ విద్యతోనే ఎంతటి విజయం అయినా వరిస్తుందని, భావిభారత నిర్మాణం విద్యాలయాలలోనే జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ దాతలు అందిస్తున్న సాయాన్ని ఉపయోగించుకుని ఉన్నత స్థానాలకు చేరాలని తెలిపారు. ఈ ఏడాది నాలుగోసారి విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందించడం జరిగిందని తెలిపారు. విద్యతోనే విజయం దక్కుతుందని, విద్యార్థుల చదువులకు ఆర్థికంగా రోటరీ క్లబ్ ద్వారా తోడ్పాటు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రొటేరియన్లు దశరథరామిరెడ్డి, జానకిరామిరెడ్డి, రఘురామిరెడ్డి, కృష్ణయ్య, రామకృష్ణ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

## అమరవీరుల సంస్మరణ దినం



గూడూరు పట్టణంలోని జేవీవీ ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 21న గూడూరు పట్టణ, రూరల్ పోలీసులను ఘనంగా సన్మానించి, జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రాంబాబు మాట్లాడుతూ విధి నిర్వహణలో పోలీసులు రాత్రి పగలు తేడా లేకుండా అనేక కష్టాలను, ఇబ్బందులను ఎదుర్కొంటున్నా సేవా కార్యక్రమాలను కూడా అలాగే చేయడం సంతోషించదగ్గ విషయమన్నారు. జేవీవీ పోలీసులకు చేస్తున్న సన్మాన కార్యక్రమం అభినందనీయమన్నారు. జేవీవీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రజలతో స్నేహపూర్వకంగా మెలిగి విధులు నిర్వహిస్తే సత్సంబంధాలు బాగుంటాయన్నారు. జేవీవీ చేస్తున్న సేవా కార్యక్రమాలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు నాగరాజు, సి.ఐ సుబ్బారావు, ఎస్సై నరేష్, పురుషోత్తం, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బాడుగకు మోటార్‌బైక్‌లు



నెల్లూర్లో మొట్టమొదటిసారిగా మోటార్‌బైక్‌లను బాడుగకు ఇచ్చే బైక్‌రెంటల్స్‌ను ఈ నెల 22వ తేదీ నెల్లూరు దర్గామిట్టలోని ఎంజిబి ఫెలిసిటి మాల్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, నగర డిప్యూటీ మేయర్ ముక్కాల ద్వారకానాథ్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులకు, వ్యాపారులకు సొంత బైక్ లేని వారికి బాడుగ బైకుల విధానం ఎంతో సౌకర్యంగా ఉంటుందన్నారు. ముందు ఆలోచనతో శరణ్‌కుమార్ దీనిని ప్రారంభించడం అభినందనీయమన్నారు. నెల్లూరు ప్రజలు బాడుగబైకులను ఉపయోగించుకుని తమ విలువైన కాలాన్ని ఆదా చేసుకోవాలని కోరారు.

## మేషం



అశ్వని, భరణి, కృతిక 1 పాదము

విద్యాప్రగతి బాగుంటుంది. పెద్దలతో, ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. ఉద్యోగులకు పనిభారం, వత్తిడి పెరుగుతుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడటం మంచిది. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త పడండి. వృత్తి వ్యాపారాలలో ఇబ్బందులను అధిగమించి, ఆదాయం పెరుగుదలకు కృషి చేస్తారు.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగులకు విధి నిర్వహణలో సామర్థ్యం బాగుంటుంది. కొత్త గృహోపకరణాలు, విలువైన వస్తువులు కొనడం జరుగుతుంది. ఆరోగ్యం ఫరవాలేదు. ప్రభుత్వ అనుమతులు, బ్యాంకు ఋణాలు లభిస్తాయి. అనుకున్న పనులు నెరవేరడానికి పట్టుదలతో ప్రయత్నాలు చేయాలి. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి బాగుంటుంది.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

కుటుంబంలో విభిన్నాభిప్రాయాలుంటాయి. సర్దుబాటు చేసుకొనాలి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. విద్యార్థులకు ఇతర వ్యాపకములుంటాయి. పెద్దలతో పరిచయాలు కలుగగలవు. ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనవలసి ఉంటుంది. వృత్తి జీవనం సుమారుగా జరిగినా వ్యాపారవర్గాల వారికి నిరాశే ఉంటుంది. ఆదాయం సామాన్యం.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

తలపెట్టిన పనులు సవ్యంగా జరిగినా నిదానంగా జరుగుతాయి. విద్యాప్రగతి బాగుంటుంది. వ్యవహారాలు ఇతరుల సలహాలు తీసుకొని సొంతంగా నిర్వహించడం మంచిది. ఆదాయం సామాన్యం. వృత్తివ్యాపారాలు సంతృప్తికరంగా ఉండవు. ఆర్థికాభివృద్ధి అవకాశాలు చేజారిపోవచ్చును. కుటుంబంలో చిన్నచిన్న భేదాభిప్రాయాలు, బంధువర్గంతో కొద్దిపాటి విభేదాలుండగలవు.



## బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు

బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

తేది. 27.10.2017 నుండి
తేది. 2.11.2017 వరకు

### పంచాంగము:

తేది 26 గురువారము "కోటిసోమవారము" పర్వదినము.
గురుమౌఢ్యమి జరుగుచున్నది.

### కార్తీక మాస శుక్లపక్ష తిధులు

| | | | |
|---|---|---|---|
| తేది. 27 | శుక్ర | సప్తమి | ఉ॥ గం.10.50వ॥ |
| తేది. 28 | శని | అష్టమి | ప॥ గం.10.28వ॥ |
| తేది. 29 | ఆది | నవమి | ప॥ గం.1.46వ॥ |
| తేది. 30 | సోమ | దశమి | ప॥ గం.2.23వ॥ |
| తేది. 31 | మంగళ | ఏకాదశి | ప॥ గం.2.51వ॥ |
| తేది. 1 | బుధ | ద్వాదశి | ప॥ గం.2.28వ॥ |
| తేది. 2 | గురు | త్రయోదశి | ప॥ గం.1.57వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

ప్రభుత్వ అనుమతులు పొందడం, కొత్త కాంట్రాక్టులు దొరకడం జరుగుతుంది. నూతన వస్తువులు సమకూర్చుకొనడం, బంధుమిత్రులను కలుసుకొనడం జరుగుతుంది. విద్యాప్రగతి బాగుంది. ఆదాయం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలు వృద్ధి చెందుతాయి. కొత్త వ్యాపార భాగస్వామ్యాలకు పెట్టుబడులకు అవకాశాలు లభించగలవు. ఆరోగ్యం సరిగా ఉండక బాధపడతారు.

## మిధునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

నిర్మాణాలు చేపట్టిన వారు త్వరగా జరుపుతారు. యజమానులకు వర్కర్లతో ఇబ్బందులుంటాయి. కొత్త పెట్టుబడులకు అవకాశాలు లభిస్తాయి. విద్యాప్రగతి బాగుంటుంది. ఉద్యోగులు సమర్ధవంతంగా విధి నిర్వహణ జరుపుతారు. ఆరోగ్యం ఫరవాలేదు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. చేపట్టిన పనులు సమర్ధవంతంగా నిర్వహిస్తారు. బాకీలు కొంతవరకు అందుతాయి.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

కుటుంబసౌఖ్యం బాగుంటుంది. ఉద్యోగులకు సమర్ధత గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగార్థులకు అవకాశాలుంటాయి. కొత్త వస్తువులు సమకూర్చుకొంటారు. పనులు చేసేటప్పుడు టెన్షన్ ఎక్కువగా ఉంటుంది. దైవ కార్యాలు వేడుకలందు పాల్గొంటారు. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ఈ రాశి వారికి ఆర్థికంగా బాగుండి, వృత్తి వ్యాపారాలలో రాణిస్తారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలుంటాయి. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. విద్యాప్రగతి బాగుంటుంది. దైవ ఆధ్యాత్మిక కార్యములందు పాల్గొంటారు. అప్పులివ్వడం, హామీలివ్వడంలో తొందర వద్దు. అలర్జీ లాంటి అనారోగ్యాలుంటాయి. వృత్తి జీవనము కలవారికి, వ్యాపారవర్గాలకు ఆర్థికంగా, అన్ని విధములా బాగుంటుంది.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కాంట్రాక్టర్లు, నిర్మాణాలు జరిపేవారికి వర్కర్లతో సమస్యలుంటాయి. ఆర్థికంగా వత్తిడులుంటాయి. చెల్లింపులు, అవసరాలను వాయిదా వేసికొనవలసి వస్తుంది. ముఖ్యవస్తువులు జాగ్రత్త చేసికొనండి. అధికారులతో, పబ్లిక్‌తో జాగ్రత్తగా మెలగండి. విద్యాప్రగతి బాగుంటుంది. చేపట్టిన పనులకు ఆటంకాలు కలుగుతాయి. వృత్తి వ్యాపార వర్గాలకు శ్రమకు తగ్గ ఫలితాలుండవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఉద్యోగవర్గాలకు సమర్ధత బాగుండి అధికారుల నుండి ప్రోత్సాహం పొందుతారు. నిరుద్యోగులకు అవకాశాలు లభించడం, ఆలోచనలలో తేడాలుంటాయి. పర్వదినాలు, దైవ కార్యాలలో చురుకుగా పాల్గొంటారు. ఆరోగ్యం బాగుంటుంది. కాంట్రాక్టర్లకు, గృహ నిర్మాణదారులకు పనులు నిదానం కాగలవు. వ్యాపారాలలో కొత్త అవకాశాలు, పెట్టుబడులకు అవకాశాలుంటాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఉద్యోగులకు పనిభారం, అధికార వర్గం నుండి వత్తిడులుంటాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. కోర్టు కేసులు వాయిదా పడతాయి. బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. వేడుకలలో పాల్గొనడం, దూరప్రయాణాలుంటాయి. అదనపు ఖర్చులు ఎక్కువగా వుంటాయి. వ్యాపారాలలో ఆశించిన స్థాయిలో వృద్ధి ఉండదు. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా వేసుకోండి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

కుటుంబంలో బేధాభిప్రాయాలను సర్దుబాటు చేసుకొంటారు. రావలసిన బాకీలు వాయిదా పడతాయి. నిర్మాణాలు నిదానంగా జరుగుతాయి. వేడుకలందు పాల్గొంటారు. అనవసరపు ఖర్చులుంటాయి. సమర్ధత బాగుండినా అనుకున్న పనులు సరిగా జరగవు. వృత్తి జీవనం గలవారికి ఆదాయం తృప్తికరంగా ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు ఆలస్యం కావచ్చును.

# ట్రంప్ తిక్క కుదిర్చిన సోమిరెడ్డి


శ్రీను గల్పిక

అది 17వ తేదీ... హైదరాబాద్‌లోని సింహపురి చాణక్య, సేద్యం మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి నివాసం. ఇంకో నాలుగు గంటల్లో సోమిరెడ్డి అమెరికాకు వెళడానికి ఎయిర్‌పోర్టుకు వెళ్లాలి... సోమిరెడ్డి అప్పుడే రెడీ అయ్యి బయట కొచ్చాడు. పట్టుచొక్కా, పెద్ద పంచె కట్టి భుజం మీద నాగలితో వున్నాడు. అక్కడే వున్న డాక్టర్ జడ్.శివప్రసాద్... ఈ గెటప్ ఏంటి సార్ అని అడిగాడు. మనం వెళుతున్నది రైతుల కోసం కదా! మనం కూడా అమెరికాకు రైతు గెటప్‌లోనే వెళితే బాగుంటుందేమోనని అన్నాడు. అందుకు జడ్.యస్... మన పెద్దలు రోమ్‌లో వున్నప్పుడు రోమన్‌లుగా వుండమని చెప్పారు, మీరు వెళ్లేది అమలాపురంకు కాదు, అమెరికాకు, దానికి తగ్గగెటప్ వేస్తే బాగుంటుందని సలహా ఇచ్చాడు. వెంటనే సోమిరెడ్డి బెడ్‌రూంలోకి వెళ్లి డ్రెస్ ఛేంజ్ చేసి ఈసారి సూటూబూటూ గెటప్‌లో వచ్చాడు. అది చూసి డాక్టర్ జడ్.యస్... ఇప్పుడు సార్ అమెరికాకు వెళుతున్నారని చెప్పినా అందరూ నమ్ముతారని అన్నాడు. సోమిరెడ్డి వుండి... డాక్టర్ అమెరికాలో చలిబాగా వుంటుంది కదా... మెడిసిన్ ఇక్కడ నుండి తీసుకెళ్లాల్నా, అక్కడ దొరుకుతుందా? అని అడిగాడు. మీరేమీ తీసుకుపోబల్లేదు సార్, ఎలాంటి మెడిసిన్ అయినా అక్కడ సులభంగా దొరుకుతుందని జడ్.ఎస్ చెప్పాడు. తర్వాత భార్య జ్యోతి, కొడుకు, కోడలు, కూతురు, అల్లుడు వచ్చి మంగళహారతి ఇచ్చి సోమిరెడ్డికి ఎయిర్‌పోర్టులో వీడ్కోలు పలికారు.

★★★★★

సోమిరెడ్డికి చికాగో ఎయిర్‌పోర్టులో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆయన భార్య, అమెరికా మంత్రులు స్వాగతం పలికారు. సోమిరెడ్డిని ట్రంప్ తన కారులోనే ఎక్కించుకున్నాడు. వీళ్ళు ఎక్కాక కాన్వాయ్ బయలుదేరింది. దారిన నడిచిపోతున్న మహిళలను చూస్తూ ట్రంప్... ఆ అమ్మాయి నడుం చూడు ఎంత బాగుందో, ఈ యువతి శరీరాకృతి చూడు... ఎంత వయ్యారంగా వుందో అని సోమిరెడ్డితో చెప్పసాగాడు. ఆ మాటలు సోమిరెడ్డికి బాగా వెగటు పుట్టించాయి. మా దేశంలో ఇలాంటి చేష్టలు చేసిన పొలిటీషియన్స్ ఇంటికి పోతారు. అందుకు ఏపి గవర్నర్‌గా వుండి ఇంటికి పోయిన ఎన్.డి.తివారీయే ఉదాహరణ. కాని మీ దేశం వాళ్ళు మాత్రం ఇలాంటి చేష్టలు చేస్తున్నందుకేనేమో మిమ్మల్ని అధ్యక్షుడిని చేసారు. అంతా కలికాలమని సోమిరెడ్డి అన్నాడు. అంతలో ట్రంప్ ఫోన్ మోగింది. ఆయన ఫోన్ ఆన్ చేసాడు. అవతలనుండి ఉత్తర కొరియా అధినేత కిమ్... చూడు ట్రంప్... నీ ఉడత బెదిరింపులు ఎక్కడైనా చూపించుకో... నాతో పెట్టుకుంటే ప్రపంచపటంలోనే అమెరికాను లేకుండా చేస్తాను, గమ్మొగా వైట్‌హౌస్‌లో కూర్చో అని చెప్పి ఫోన్ పెట్టేసాడు. ట్రంప్‌కు చిర్రెత్తుకొచ్చింది. ఛీ దీనమ్మ జీవితం... ఇంత బ్రతుకు బ్రతికి వీడిచేత మాటలు పడాల్సి వస్తుంది. వీడి పీడ విరగడయ్యేదెట్లా... అని మదనపడసాగాడు. సోమిరెడ్డి అతని భుజం మీద చెయ్యి వేసి సముదాయిస్తూ... మీ సమస్యంతా అతను మీకు ఫోన్ చేసి సవాల్ విసురుతుండబట్టే కదా? అని అడిగాడు. అవును... అని ట్రంప్ అన్నాడు. టక్కున సోమిరెడ్డి ట్రంప్ సెల్‌ఫోన్ తీసుకుని కారు గ్లాస్ దించి పక్కనే వున్న కాలువలో పడేసాడు. ఆ పరిణామానికి ట్రంప్ ఆశ్చర్యపోయి... ఎందుకలా చేసావని అడిగాడు. దానికి సోమిరెడ్డి... ఈ సెల్‌ఫోన్ మీ దగ్గరుండడం వల్లే కదా... ఆ కిమ్ ఫోన్ చేయడం, మీకు మనశ్శాంతి లేకుండా పోవడం... ఇప్పుడు ఆ కిమ్ ఎలా ఫోన్ చేయగలడు? ఎలా మాట్లాడగలడు... అని లాజిక్‌గా ప్రశ్నించాడు. సోమిరెడ్డి మాటలకు ట్రంప్ నిజమే కదా... నాకింత కాలం ఈ ఐడియా రాక అశాంతితో వున్నానని చెప్పాడు. తర్వాత అందరూ ఒక వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లారు. అక్కడ బంగాళాదుంపల పంటను చూపిస్తూ ట్రంప్... మా దేశంలో రైతు బంగాళాదుంపలు పండించి ఎకరాకు పదివేల డాలర్లు సంపాదించగలడని అన్నాడు. అది విన్న సోమిరెడ్డి... ఈ విషయంలో మీరు చాలా వెనుకబడి వున్నారు. మా తెలంగాణ సీఎం కేసీఆర్ అయితే ఒక ఎకరా బంగాళాదుంపలు పండించే కోటి రూపాయలు సంపాదిం చాడని చెప్పాడు. అక్కడ ట్రంప్ ముఖం చిన్నబోయింది. సోమిరెడ్డిని ట్రంప్ ఇంకొంచెం ముందుకు తీసుకెళ్ళి టమోటా పంటను చూపిస్తూ... ఈ దేశంలో టమోటాలు విపరీతంగా పండుతాయి అని చెప్పాడు. దానికి సోమిరెడ్డి... మా చిత్తూరు జిల్లా మదనపల్లి వద్ద టమోటాలను రోడ్ల పైనే పారేసి పోతుంటారు... మా దేశంలో పశవులకు కూడా టమోటాలనే ఆహారంగా పెడుతుంటాం అని చెబుతుండగా అప్పుడే ఆయన సెల్ మోగింది. సోమిరెడ్డి ఫోన్ ఎత్తాడు. అమరావతి నుండి వ్యవసాయశాఖ డైరెక్టర్... సార్, రాష్ట్రంలో టమోటా ధరలు అదిరిపోతున్నాయి. కిలో 50రూపాయలు దాటిపోయింది. బయట రాష్ట్రాల నుండి తెప్పించమంటారా? అని అడిగాడు. సోమిరెడ్డి అలాగే చేయండని చెప్పి ఫోన్ కట్ చేశాడు. ట్రంప్‌కు వాళ్ళు మాట్లాడుకున్నది తెలుగు కాబట్టి అర్థం కాక ఏమన్నా ప్రాబ్లమా అని అడిగాడు. మా రాష్ట్రంలో టమోటా పంట ఎక్కువై ఎక్కడ నిల్వ చేయాలో అర్థం కావడం లేదు, అందుకే సముద్రంలో తోసేయమని చెప్పాను. కనీసం చేపలైనా తింటాయని అన్నాడు. ట్రంప్ తర్వాత బెండకాయల తోట వద్దకు తీసుకెళ్ళి... అక్కడ వాటంగా వున్న బెండకాయలను చూపిస్తూ... మా దేశంలో విత్తనం నాటిన నెల రోజులకే బెండకాయలు కోసుకోవచ్చన్నాడు. అది విని సోమిరెడ్డి... ఈ విషయంలో మా కన్నా మీరు చాలా వెనుకబడి వున్నారు. మేం ఈరోజు విత్తనం నాటితే, పక్కరోజు కాయలు కాస్తాయని చెప్పాడు. తమ దేశ వ్యవసాయరంగం గొప్పతనాన్ని ప్రదర్శించాలని ట్రంప్ తపన పడుతుంటే, సోమిరెడ్డి ఎప్పటికప్పుడు ఆయన ఎత్తులను చిత్తు చేసాడు. చివరి ప్రయత్నంగా ట్రంప్ వరిపొలం వద్దకు తీసుకెళ్లాడు. ఇది హైబ్రీడ్ రకం వరి.... ఎకరాకు 5 క్వింటాళ్లకు తక్కువ కాకుండా పంట చేతికొస్తుందన్నాడు. అప్పుడు సోమిరెడ్డి... మేమూ వరిపైరు విధానాన్ని పూర్తిగా కంప్యూటరైజ్డ్ చేశాం. మా చంద్రబాబు కృషితో వ్యవసాయానికి కూడా టెక్నాలజీని అనుసంధానం చేసాం. భూమిలో వరి నాట్లు వేసాక ప్రతి మొక్కకు ఒక చిప్ అమరుస్తాం... దానిని కంప్యూటర్‌తో అనుసంధానం చేస్తాం. కంప్యూటర్ ద్వారా మనం ఇచ్చే కమాండ్‌ను బట్టి ఎకరాకు ఎన్ని పుట్లు కావాలంటే అన్ని పుట్లు పండించుకోవచ్చు. ఈ విషయంలో మేం ఇస్రో సహకారం కూడా తీసుకుంటున్నాం అని చెప్పాడు. సోమిరెడ్డి మాటలతో ట్రంప్‌కు తల తిరిగినంత పనైంది. అయినా తమాయించుకుని ఇక ఇతనితో పెట్టుకుంటే లాభం లేదనుకుని సోమిరెడ్డిని కారెక్కించుకుని వాషింగ్టన్‌లోని వైట్ హౌస్‌కు బయలుదేరాడు. వాషింగ్టన్ రోడ్డు మీద అటు ఇటు వెళుతున్న జనాన్ని చూస్తూ ట్రంప్‌తో సోమిరెడ్డి... మీ దేశంలో కుల, జాతి, మత వివక్ష లేదు గాని లింగ వివక్ష ఎక్కువనుకుంటా అని అడిగాడు. ఆ మాటకు ట్రంప్ బిత్తరపోయి... ఆ డౌటెందుకొచ్చిందని అడిగాడు. దానికి సోమిరెడ్డి... మీ దేశంలో మగాళ్లంతా కోటీశ్వరులుగా వున్నారు... ఆడోళ్ళు మాత్రం కటిక దరిద్రం అనుభవిస్తున్నట్లున్నారు. నిండుగా కప్పుకోవడానికి గుడ్డలు కూడా లేక ఎలా వెళుతున్నారో చూడండి అని రోడ్డు వైపు చూపించాడు. అక్కడ ట్రంప్‌కు మోకాళ్లకు పైన స్కర్ట్స్ వేసుకున్న అమ్మాయిలు వెళుతూ కనిపించారు. వాళ్లను చూడగానే ట్రంప్... హే బ్యూటిఫుల్.. ఏం ఫిజిక్ అని కామెంట్ చేసాడు. అది విన్న సోమిరెడ్డి ఇతడి కామం తగలెయ్యా... గుడ్డలకు కూడా గతిలేని పేద మహిళలను మానవత్వంతో కాకుండా కామంతో చూస్తాడా, అతడిని ఆ దేవుడే క్షమించాలి అంటూ మౌనంగా వుండిపోయాడు.

# జిల్లా గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



నెల్లూరులోని రేబాలవారివీధిలో ఉన్న జిల్లా కేంద్ర గ్రంథాలయానికి పొదలకూరుకు చెందిన ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, ఏవి సుధాకర్‌లు సుమారు 50వేల రూపాయల విలువజేసే పుస్తకాలను బహుకరించారు. ఈనెల 24న గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయసంస్థ అధ్యక్షుడు కిలారి వెంకటస్వామినాయుడు మాట్లాడుతూ, పాఠకులకు ఎంతగానో ఉపయోగపడే గ్రంథాలయాలను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అన్నారు. ఈ గ్రంథాలయానికి పుస్తకాలను వితరణ చేసిన పొదలకూరు ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ కార్యదర్శులు కృష్ణయ్య, మంజులత, మేరి, సీతారామయ్య తదితరులు పాల్గొన్నారు.

# శ్రీధరన్నకు అందరి ఆశీస్సులు ఉండాలి

## - కోటంరెడ్డి యువసేన అధ్యక్షుడు విష్ణు



నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి అటు రాజన్న దీవెనలు, జగనన్న ప్రోత్సాహంతో పాటు ప్రజలందరి ఆశీస్సులు ఉండాలని, ఆ దీవెనలతో శ్రీధరన్న చేపట్టిన 'మన ఎమ్మెల్యే-మన ఇంటికి' కార్యక్రమం జయప్రదం కావాలని కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి యువసేన అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన ఆధ్వర్యంలో నెల్లూరులోని కరెంటాఫీసు సెంటర్లో ఉన్న డా. వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ, నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా ప్రతి ఇంటికి వెళ్ళి వారి సమస్యలను తెలుసుకుంటున్నారని, ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత 25 రోజులుగా ఎమ్మెల్యే తన ఇంటికి వెళ్ళకుండా ప్రజల మధ్యలో ఉంటూ వారి ఇబ్బందులు తెలుసుకుంటూ, వారి కష్టాలు తీర్చేందుకు తనవంతు కృషి చేస్తున్నారన్నారు. ప్రజలందరి ఆదరాభిమానాలు అందుకుంటున్న శ్రీధరన్న రాష్ట్రంలోనే నంబర్-1 ఎమ్మెల్యేగా మంచిపేరు తెచ్చుకున్నారని, ఎమ్మెల్యే కోటంరెడ్డి చేపట్టిన 105 రోజుల ప్రజాబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మాదా బాబు, స్పందన కుమార్, రాజేష్, రావినూతల మధు, భరత్, సుభాష్, వేణు, వాసు తదితరులు పాల్గొన్నారు.

## వెయిట్ లిఫ్టింగ్‌లో..

# కస్తూరిదేవి విద్యార్థినికి కాంస్యం

విజయవాడలో ఈ నెల 21వ తేదీన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో(అండర్-17 విభాగంలో) నెల్లూరులోని శ్రీ కస్తూరిదేవి ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎస్.భార్గవి కాంస్య పతకాన్ని సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ జె.వి.రెడ్డి తెలిపారు. ఈ నెల 23వ తేదీన పాఠశాలలో విద్యార్థినిని అభినందించినట్లు తెలిపారు. హెడ్‌మాస్టర్ వనజ, పిఇటి వై.జ్యోతి, స్వర్ణలత పాల్గొన్నారు.

## కాలధర్మం

# పొత్తూరి నిర్మల



విశ్రాంత వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నెల్లూరుజిల్లా అధ్యక్షులు పి.మోహన్‌రావు సతీమణి పొత్తూరి నిర్మల(67) ఈ నెల 22వ తేదీన అనారోగ్యంతో కనుమూసారు. ఆమెకు ఇద్దరు కుమారులు. సీనియర్ సిటిజన్‌గా మోహన్‌రావు నెల్లూరులో అందరికీ సుపరిచితుడే. సహధర్మచారిణిని కోల్పోయిన మోహన్‌రావును నగరంలో పలువురు ప్రముఖులు పరామర్శించారు. నిర్మలమ్మ మృతికి సంతాపం ప్రకటిస్తూ... వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# కాక తగ్గని కాకాణి

## నువ్వా-నేనా అంటూ సవాల్




నెల్లూరుజిల్లా సర్వేపల్లి నియోజకవర్గ రాజకీయాల్లో నువ్వా... నేనా! తేలిపోవాలని మంత్రి సోమిరెడ్డిని ఉద్దేశించి సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి సవాల్ విసిరారు.

నెల్లూరు మాగుంట లే అవుట్‌లోని వైయస్సార్సీపీ కార్యాలయంలో మంగళవారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని నాలుగు సార్లు ప్రజలు తిరస్కరించారన్న విషయాన్ని గుర్తుంచుకుంటే మంచిదన్నారు. సోమిరెడ్డికి దేవుడి మీద నమ్మకం వుంటే ఆయన కుటుంబసభ్యుల సమక్షంలో దేవుని సన్నిధిలో ఛార్జిషీట్‌లో ఉన్నవన్నీ నిజాలని ప్రమాణం చేస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానన్నారు. నాలుగుసార్లు ఓటమిని తట్టుకోలేకే తనపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఇప్పటికీ తాను ఆరోపించిన మాటలకు కట్టుబడి వున్నానన్నారు. టిడిపి జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్రకు పూర్తిగా రాజకీయ పరిపక్వత లేదన్నారు. తెలిసీ తెలియకుండా మాట్లాడుతుంటారన్నారు. తనపై ఛార్జ్‌షీట్ వేసారని అందువల్ల వెంటనే గోవర్ధన్‌రెడ్డి రాజీనామా చేయాలని రవిచంద్ర కోరడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన సీఎం చంద్రబాబుపై ఛార్జిషీట్ వేసారన్నారు. చంద్రబాబుపై అనర్హత వేటు వేయించగలవా అని ప్రశ్నించారు. సోమిరెడ్డిని త్వరలోనే న్యాయస్థానం ముందు దోషిగా నిలబెడతానన్నారు. ఈ సమావేశంలో వెంకటాచలం జడ్పీటీసీ సభ్యుడు ఎం.వెంకటశేషయ్య, భాస్కర్‌గౌడ్, చిరంజీవి, ప్రసాద్ పాల్గొన్నారు.

## వార్షికోత్సవం సందర్భంగా

# ఉచిత వైద్య సేవలు




నెల్లూరు పొగతోటలోని డయాబెటిస్ క్లినిక్‌లో సుప్రసిద్ధ షుగర్ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ సత్యనారాయణ మూర్తి అల్లుడు, ఎండోక్రైనాలజిస్ట్ డాక్టర్ ఎం.వి. రామ్మోహన్ రెండేళ్ళ క్రితం ఎండోక్రైనాలజీ షుగర్‌వ్యాధి హాస్పిటల్‌ను ప్రారంభించి వైద్యసేవలు అందిస్తున్నారు. ఆసుపత్రి ప్రారంభించి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా ఈ నెల 22వ తేదీన ఆసుపత్రితో పాటు మొత్తం 12 కేంద్రాల్లో ఉచిత వైద్య సేవలు ఏర్పాటు చేశారు. 1650మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, వారిలో 300మందికి షుగర్ వ్యాధి ఉన్నట్లు గుర్తించి వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమాల్లో డాక్టర్ ఎం.వి.రామ్మోహన్, వారి సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులకు సామాగ్రి

## పందిళ్ళపల్లి ఔదార్యం



నెల్లూరు విఆర్‌సి వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పందిళ్ళపల్లి పట్టాభిరామిరెడ్డి తన సతీమణి స్వర్గీయ పందిళ్ళపల్లి అరుణమ్మ జ్ఞాపకార్థం ఇటీవల బాలాజీ నగర్ బాజీతోటలోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్కూలు బ్యాగ్‌లు, పరీక్షా ప్యాడ్‌లు ఉచితంగా అందజేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రానికి బీరువాను బహుకరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ ఏరియా ప్రెసిడెంట్ ఎం.వి.సుబ్బారెడ్డి, కార్యదర్శి బి.నాగేశ్వరరావు, కోశాధికారి టి.వెంకటేశ్వర్లు, ఆర్గనైజింగ్ కార్యదర్శి జె.వెంకటేశ్వరరావు, హెడ్‌మాస్టర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సదస్సు



నెల్లూరు పొదలకూరురోడ్డులోని రెడ్‌క్రాస్ ఆసుపత్రిలో ప్రపంచ రొమ్ము క్యాన్సర్ అవగాహన, జాతీయ మెమోగ్రఫీ దినోత్సవ కార్యక్రమం ఈ నెల 20వ తేదీ ఆసుపత్రి ప్రాంగణంలో జరిగింది. ఈ సందర్భంగా ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ టి.లక్ష్మి మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే తగిన చికిత్స అందించి వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చన్నారు. రొమ్ము క్యాన్సర్ ఉందో లేదో తెలుసుకునే విధానంపై మహిళలకు అవగాహన కల్పించారు. అనుమానం వస్తే వెంటనే వైద్యుల వద్దకు వెళితే అల్ట్రాసౌండ్ స్కానింగ్, మెమోగ్రమ్ విధానంలో పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారిస్తారని తెలిపారు. ఎన్టీఆర్ వైద్యసేవ కార్డు లేని వారు సైతం ఆరోగ్య రక్ష పథకం క్రింద ఏడాదికి రూ. 2లక్షల వరకు వైద్యసేవలు పొందవచ్చన్నారు. సంవత్సరానికి ఒకరికి రూ. 1200 చొప్పున చెల్లించి ఈ పథకంలో చేరవచ్చన్నారు. రేడియేషన్ అంకాలజిస్ట్ డా॥ గీతాఉషశ్రీ, డా॥ యం.సుమంత్ కుమార్, జి.కన్యాకుమారి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పుట్టినరోజున ఆదాల వరాలు



సాధారణంగా నాయకులు తమ పుట్టినరోజు వేడుకలను కేక్ కట్ చేసి భారీగా జరుపుకోవడం మామూలే! అయితే అందుకు భిన్నంగా మాజీమంత్రి, నెల్లూరురూరల్ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి జన్మదిన వేడుకలను ఈ నెల 25వ తేదీ నెల్లూరు మినీబైపాస్‌రోడ్డులోని తన ఇంట్లో జరుపుకున్నారు. తన అభిమానులు, కార్యకర్తలకే కాదు అనాథలకు అంధులకు కూడా తన పుట్టినరోజును ఒక పండుగగా మార్చి, వారి సంక్షేమాన్ని కాంక్షిస్తూ వారి కోసం మానవతాదృక్పథంతో ఆర్థిక సాయాన్ని అందించారు. వాత్సల్య అనాథాశ్రమానికి లక్షా50వేలు, విశ్వభారతి అంధుల పాఠశాలకు లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు.

గతంలో ఎప్పుడూ లేనంత ఘనంగా ఈసారి ఆయన జన్మదిన వేడుకలు జరపడం విశేషం. నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని కార్పొరేషన్ డివిజన్‌లు, అన్ని గ్రామాల నుండి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, ఆదాల అభిమానులు, ఆప్తులు, కార్పొరేటర్‌లు, నాయకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఆదాలను పూల మాలలు, బొకేలు, శాలువాలతో సత్కరించారు. రూరల్ గ్రామాల నుండి తరలివచ్చిన అభిమానులకి టిఫిన్‌లు, భోజనాలు ఏర్పాటు చేశారు. ఆదాల ఇంటికి జనం ఇంతగా తరలిరావడంలో విజయ డెయిరీ ఛైర్మెన్ రంగన్న కృషి బాగానే వున్నట్లు తెలుస్తోంది.

తన జన్మదినాన్ని అభాగ్యుల పాలిట పర్వదినంగా చేసుకున్న ఆదాలకు 'లాయర్' అభినందనలు.

# సరస్వతి నిధికి పోర్టు విరాళం



ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందించాలనే లక్ష్యంతో గతంలో కలెక్టర్‌గా పనిచేసిన బి.శ్రీధర్ సరస్వతినిధిని ఏర్పాటు చేసిన సంగతి విదితమే! ఈ నిధికి ఎందరో దాతలు విరాళాలిచ్చారు. దానిపై వస్తున్న వడ్డీతో పేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యను అందిస్తున్నారు. కాగా, కృష్ణపట్నం పోర్టు కంపెనీ లిమిటెడ్ వారు సరస్వతినిధికి 10లక్షల రూపాయలు విరాళంగా ఇచ్చారు. 25వ తేదీ పోర్టు పిఆర్ హెడ్ గంటా వేణుగోపాలరావు జాయింట్ కలెక్టర్ ఇంతియాజ్ అహ్మద్‌ను కలిసి ఈ విరాళం చెక్కును అందజేశారు.



# అమెరికా వ్యవసాయ సదస్సులో సోమిరెడ్డి

ఈ నెల 19న అమెరికాలోని అయోవా స్టేట్‌లో జరిగిన వరల్డ్ ఫుడ్ ప్రైజ్ వేడుకలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పాల్గొన్నారు. ఆయనతో పాటు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి యనమల రామకృష్ణుడు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు పరకాల ప్రభాకర్ మరియు అమెరికా వ్యవసాయ శాస్త్రవేత్తలు, నిపుణులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# పల్లెల్లో నడుస్తూ... ప్రజల్ని పలుకరిస్తూ...

## - కొనసాగుతున్న కోటంరెడ్డి ప్రజాబాట



'మన ఎమ్మెల్యే - మన ఇంటికి' కార్యక్రమంలో భాగంగా తన నియోజకవర్గంలోని అన్ని పల్లెలను చుడుతున్న గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఈ నెల 25వ తేదీన పెనుబర్తి దళిత వాడ, పల్లిపాళెంలలో పర్యటించారు. ఉదయం 6గంటలకే ఇంటింటికి తిరగడం మొదలుపెట్టారు. ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను ఆయనకు వివరించారు. చాలామంది మహిళలు తమకు ఇళ్ళు లేవని, ఒక్కో ఇంటిలోనే రెండు, మూడు కుటుంబాల వాళ్ళం సర్దుకుంటున్నామని చెప్పుకున్నారు. ఈ సందర్భంగా కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ హరిజన, గిరిజన కాలనీలలో ఇళ్ల సమస్య తీవ్రంగా వుందని, ఎప్పుడో కట్టిన ఇళ్ళు కావడం, పాతవి కావడం, ఇరుకువి కావడం, కుటుంబాలు పెరగడంతో ప్రజలు ఇళ్ల సమస్యను ఎదుర్కొంటున్నారని అన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి ప్రభుత్వమే స్థలాలు చూపించాలని, ఒకవేళ ఆ ప్రాంతాలలో ప్రభుత్వ స్థలాలు లేకపోతే ప్రభుత్వమే ప్రైవేట్ స్థలాలు కొని ఇళ్లు కట్టించి పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

# వైద్యారోగ్యశాఖ పనితీరుపై కలెక్టర్ ఆరా

జిల్లా వైద్యారోగ్యశాఖ ఉద్యోగుల పనితీరుపై జిల్లా కలెక్టర్ ఆర్.ముత్యాలరాజు ఆరా తీశారు. బుధవారం నెల్లూరులోని ఆ శాఖ కార్యాలయానికి వెళ్లి అక్కడ హాజరు పట్టికను పరిశీలించారు. జిల్లా కుష్టు నియంత్రణ విభాగంలో స్వీపర్‌గా పనిచేసే ఉద్యోగి విధులకు ఆలస్యంగా వస్తున్న విషయాన్ని గుర్తించి అతడిని వెంటనే ఉదయగిరి ఆరోగ్యకేంద్రానికి బదిలీ చేయాలని ఆదేశించారు. విషజ్వరాలపై ప్రజలను చైతన్యం చేసేందుకు ప్రచార బోర్డులను ఏర్పాటుచేయాలని అక్కడి సిబ్బందికి సూచించారు. జడ్పీసమావేశంలో విషజ్వరాలపై చర్చ సందర్భంగా ప్రజాప్రతినిధులు ప్లేట్‌లెట్స్ కౌంట్‌కు సంబంధించిన పరికరాలను అందజేస్తామని హామీ ఇచ్చారని, వాటిని జిల్లాలోని ప్రభుత్వాసుపత్రుల్లో అవసరం ఉన్నచోట ఏర్పాటుచేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డిఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రమాదేవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ సుబ్బారావు, డిఎంఓ వేణుగోపాల్, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ తెలుగుబిడ్డ

(మొదటి పేజీ తరువాయి)

ఓటు-నోటు కేసును సూట్‌కేసులో పెట్టి తాళం వేసాడు. తెలంగాణలో తెలుగుదేశం నాయకులకు కాంట్రాక్టులొచ్చాయి. పబ్‌లకు పర్మిషన్‌లు వచ్చాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారాలకు నిధులొచ్చాయి. తెలంగాణలో టీఆర్ఎస్‌తో తెలుగుదేశం పొత్తు దాదాపు ఖరారయ్యింది. కేసీఆర్ కూడా తెలుగుదేశం పార్టీ పాత కాపే కావడంతో ఆ పార్టీ నాయకులందరితో సత్సంబంధాలు పెట్టుకున్నాడు. వారికి ఆర్థిక ప్రయోజనాలు సమకూర్చాడు.

కాని, ఈ మొత్తం ఎపిసోడ్‌లో బకరా అయిన ఏకైక నాయకుడు రేవంత్‌రెడ్డి. చంద్రబాబును అతిగా నమ్మితే ఏమవుతుందో ఇప్పటికిగాని తెలుసుకోలేకపోయాడు. చంద్రబాబు తన వెనుక కొండంత అండగా వుంటాడని నమ్మి కేసీఆర్‌పై కత్తులు దూసాడు. తెలంగాణలో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చింది మొదలుకొని ప్రతిపక్ష కాంగ్రెస్ నాయకులకంటే కూడా రేవంత్‌రెడ్డే ప్రతిపక్ష నేత పాత్రను పోషించాడు. తెలంగాణలో కాంగ్రెస్, టీడీపీ, బీజేపీలతో చాలామంది అగ్రనేతలు కేసీఆర్‌తో అంతర్లీనంగా కుమ్మక్కయినా రేవంత్‌రెడ్డి మాత్రం కేసీఆర్‌పై పోరాటం బాటనే ఎంచుకున్నాడు. తెలుగుదేశం కోసమే ఎమ్మెల్సీ ఎన్నికల్లో నామినేటెడ్ ఎమ్మెల్సీ స్టీఫెన్‌సన్ ఇంటికి వెళ్ళి డబ్బులతో ఆయన ఓటును కొనాలని చూసి 'ఓటు-నోటు' కేసులో చంద్రబాబుతో పాటు ఇరుక్కున్నాడు. ఇదంతా కూడా అతను తెలుగుదేశం కోసమే చేసాడు. కాని, తెలుగుదేశం వాళ్ళు ఆయన ఏ కేసీఆర్‌తో అయితే పోరాటం చేస్తున్నాడో అదే కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారు. దీనిని ఆలస్యంగా తెలుసుకున్న రేవంత్‌రెడ్డి తన పార్టీపైనే తిరుగుబాటు చేసాడు. కేసీఆర్‌తో పోరాటానికంటే అతనితో పొత్తుకే మొగ్గుచూపుతున్న తెలుగుదేశం నాయకులు రేవంత్‌రెడ్డిని వదులుకోవడానికి సిద్ధంగా వున్నారు. రేవంత్ కూడా కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధపడిపోయాడు. ఇప్పుడు చంద్రబాబుతో పాటు రేవంత్‌రెడ్డి కూడా 'ఓటు-నోటు' కేసులో నిందితుడు. రేపు రేవంత్ కాంగ్రెస్‌లోకి వెళితే ఈ కేసు ఏమవుతుందో చూడాలి. రేవంత్‌ను తొక్కాలంటే చంద్రబాబుకు కూడా ఉచ్చు బిగుసుకుంటుంది. చంద్రబాబును కాపాడాలనుకుంటే రేవంత్‌ను వదలక తప్పదు. ఈ పరిణామం కేసీఆర్‌కు మింగుడుపడకపోవచ్చు. ఏదిఏమైనా తెలంగాణ తెలుగుదేశంలో రేవంత్‌రెడ్డి ఎపిసోడ్ చంద్రబాబుకు షాకే! రేవంత్ బయటకు వెళితే అక్కడ టీడీపీని టీఆర్ఎస్‌కు అమ్మకానికి పెట్టినట్లే!

## శరత్‌చంద్రారెడ్డి సేవాసమితి ఆధ్వర్యంలో

# దీపావళి వేడుక



నెల్లూరులోని మాగుంట శరత్‌చంద్రారెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో దర్గామిట్టలో ఉన్న విశ్వభారతి అంధుల పాఠశాలలో ఇటీవల దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అక్కడి చిన్నారులచేత టపాసులు కాల్పించి పండుగ నిర్వహించారు. చిన్నారులందరికీ స్వీట్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యుడు కమతం అశోక్ మాట్లాడుతూ, మాగుంట శరత్‌చంద్రారెడ్డి సూచన మేరకు తామంతా దీపావళి పండుగను ఇక్కడి పిల్లలందరి సమక్షంలో ఆనందంగా జరుపుకున్నామన్నారు. చిన్నారులు కూడా ఎంతో సంతోషించారని అన్నారు. ఈ కార్యక్రమంలో క.లేకిన్‌రెడ్డి, మాదాబాబు, మనోజ్ చౌదరి, రాఘవేంద్రరెడ్డి, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

# తృతీయ వర్ధంతి



అందరి హృదయాలలో సుస్థిర స్థానమేర్పరుచుకుని,
నిండు నూరేళ్ళు పరిపూర్ణ జీవితాన్ని సాగించిన ప్రేమానురాగాల దీప్తి,
మా అభివృద్ధికి కారకురాలు, దైవసమానులు

## కీ॥శే॥ శ్రీమతి గునుపాటి రుక్మిణమ్మ గారు

పరమపదించి తేది 30-10-2017 నాటికి
మూడేళ్ళు పూర్తికానున్న సందర్భంగా వారి పవిత్రాత్మకు శాంతి కలగాలని
ఆ భగంతుని ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము

**కుమారులు - కోడళ్ళు**
గునుపాటి వెంకటకృష్ణారెడ్డి - ఇందిరమ్మ
గునుపాటి జనార్ధన్‌రెడ్డి - సునీతమ్మ
గునుపాటి రామ్‌మోహన్ రెడ్డి - శుభప్రదమ్మ

**కుమార్తెలు - అల్లుళ్ళు**
కోటిరెడ్డి నిర్మలమ్మ - కీ॥శే॥ కోటిరెడ్డి రామచంద్రారెడ్డి
అత్తివరపు విమలమ్మ - అత్తివరపు రామచంద్రారెడ్డి
దొడ్ల లలితమ్మ - దొడ్ల పద్మనాభరెడ్డి

మరియు
**మనుమలు, మనుమరాళ్ళు, ముదిమనుమలు, ముదిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com